తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శనివారం-29- నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 182 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# 'తెలంగాణ సాధన.. కేసీఆర్ దీక్ష నాటకమే'

- 'కేసీఆర్ దీక్ష వల్ల కాదు... సోనియాతోనే తెలంగాణ'
- బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది: మహేశ్ గౌడ్
- కుటుంబంలో ఎవరైనా ప్రాణత్యాగం చేశారా? టీపీసీసీ ప్రశ్న
- బీసీ రిజర్వేషన్లలో పెద్ద ఎత్తున కోతలేదని టీపీసీసీ స్పష్టం
- బీసీ సంఘాల నిరసనలు తప్ప ప్రదేశంలో జరుగుతున్నాయి: మహేశ్ గౌడ్
- బీజేపీ–బీఆర్ఎస్ రెండూ బీసీ రిజర్వేషన్లకు అడ్డు: ఆరోపణ
- ఎంఐఎంపై రోజూ రాజకీయాలు చేస్తున్నది బీజేపీనే: టీపీసీసీ



హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్ర సాధ న పేరుతో నాడు కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించా రు. ఇప్పుడు బీఆర్ ఎస్ ఉనికిని చాటుకు నేందుకు కోట్లాది రూపాయల ఖర్చుతో దీక్షా దివస్ పేరుతో ఆ నాటకాన్ని రక్తి కట్టించేందుకు యత్నిస్తు న్నారని దుయ్యబట్టారు. మహేశ్ గౌడ్ శుక్ర వారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లా డుతూ.. ఆ రోజున కేసీఆర్ చేసిన దీక్ష వల్ల తెలంగాణ రాలేదని, సోనియాగాంధీ వల్ల రాష్ట్రం వచ్చిందన్నారు. సోనియా చిత్రప టాలకు పాలాభిషేకాలు చేయాలని, అమర వీరులకు నివా ళులర్పించాలని చెప్పారు. అసలు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కు టుంబసభ్యులు కానీ, దూరపు బంధువులు కానీ ఎవరైనా ప్రాణా లు కోల్పో యారా అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టేలా దీక్షా దివస్‌లు మాను కోవాలని బీఆర్ఎ స్‌కు హితవు పలికారు. 'ఎవరు తెలంగాణ ఇస్తే.. ఎవరు అధికారంలోకి వచ్చారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ పాత్ర ఉందన్న ది వాస్తవం. పులి నోటిలో తల పెట్టి కేసీఆర్ తెలంగాణ తెచ్చాడన్నది మాత్రం అవాస్తవం. కేవలం ఆయన వల్లనే తెలంగాణ రాలేదు' అని అన్నారు.

మిగతా 2లో



# తెలంగాణలో రైల్వే ఆధునికీకరణకు కొత్త ఊపు వచ్చింది

- ఒకేసారి 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణలో తెలంగాణ
- హైటెక్ సిటీ స్టేషన్ ద్వారా రోజూ 5,400 మంది ప్రయాణికుల రద్దీ
- సంక్రాంతికి 16 ప్రత్యేక ట్రైన్లు హైటెక్ సిటీ స్టేషన్‌లో నిలుపుదల
- కొమురవెల్లి స్టేషన్ నిర్మాణం పూర్తి దశలో — త్వరలో ప్రారంభం
- ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌ను యాదాద్రి వరకు విస్తరించనున్న కేంద్రం
- కాజీపేటలో రైల్వే మల్టీ మ్యాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణం వేగవంతం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

నరేంద్రమోదీ ప్రధాన మంత్రి అయిన తర్వా త తెలంగాణలో రైల్వే అభివృద్ధి వేగవంత మైందని కేంద్రమంత్రి జి.కి షన్‌రెడ్డి అన్నారు. రైల్వేలైన్ల నిర్మాణం, స్టేషన్ల ఆధునికీకరణ సహా రాష్ట్రంలో ఏక కాలంలో 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధ రణ జరుగుతోందన్నారు. హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను శుక్రవా రం ఆయన రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో ప్రతిరోజూ 62 సబర్బన్ ట్రైన్లు, ఎంఎంటీఎస్ ట్రైన్లు ఆగుతున్నా యని చెప్పారు. హైదరాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్, బోరబండ, ఫలక్‌నుమా వంటి స్టేషన్లకు ఈ స్టేషన్ నుంచి కనెక్టి విటీ ఉందన్నారు.
ఇప్పుడు మరింత కనెక్టివిటీ, మరిన్ని సౌ కర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

మిగతా 2లో




# పంచాయతీ ఎన్నికలు నిలవవు

## జీవో 46పై జోక్యం లేదని హైకోర్టు స్పష్టం

- జీవో 46 నిలిపివేతకు హైకోర్టు నిరాకరణ ఎన్నికల ప్రక్రియలో జోక్యం సరికాదని వ్యాఖ్య
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50% పరిమితిలోనే ఉండాలని చట్టం స్పష్టం
- గంగపుత్ర, రజకుల సంఘాలు సహా ఐదుగురి పిటిషన్లపై ధర్మాసనం విచారణ
- నోటిఫికేషన్ జారీనామినేషన్లు ప్రారంభం
- రిజర్వేషన్ల ప్రక్రియ రాజ్యాంగబద్ధం కాదన్న పిటిషనర్ల వాదనలపై కోర్టు స్పందన

2లో



# పంచాయతీ ఎన్నికల వ్యూహంపై సీఎం

## టీపీసీసీ చీఫ్ కీలక భేటీ

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ అవకాశాలపై చర్చ
- ప్రజాపాలన వారోత్సవాల్లో పార్టీ శ్రేణుల పాల్గొనడంపై సీఎం సూచనలు
- డిసెంబర్ 2న డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ కార్యవర్గంతో కీలక సమావేశం

2లో

# దిత్వా తుఫాను ప్రభావం

## తెలంగాణలో చలి తీవ్రత పెరగనుంది

- దిత్వా తుఫాను ఆదివారం పుదుచ్చేరి తీరానికి చేరే అవకాశమంటున్న వాతావరణ శాఖ
- తెలంగాణలో 30 వరకు తీవ్రమైన చలి
- ష్ణోగ్రతలు 9–11 డిగ్రీలకు పడిపోతాయని అంచనా

2లో




# టి–రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ భద్రతా ఏర్పాట్లు

- 2,500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు
- వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులు
- వీఐపీ, మహిళా ప్రతినిధుల భద్రతకు ప్రత్యేక వింగ్
- గ్లోబల్ సమ్మిట్‌లో 600 మంది ప్రతినిధులు హాజరు

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

డిసెంబర్ 8, 9వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహేశ్వ రం, మిర్ఖాన్ పేటలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి పోలీసుశాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్ల మధ్య భారీ బందోబస్త్ కల్పిస్తోంది. శుక్రవారం మహేశ్వరం లో బందోబస్త్ మీద రాచకొండ సిపి సుధీర్ బాబు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, టీజీ ICC ఏండి శశాంక్ మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి ట్రాఫిక్ డీసీపీలతో కలిసి టి రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ కమిటీ సభ్యులతో, వివిధ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో వారినుండి పోలీసు శాఖకు ఎలాంటి సహాయ సహకారా లు అందించాలి,

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# 'తెలంగాణ సాధన.. కేసీఆర్ దీక్ష నాటకమే'

(మొదటి పేజీ తరువాయి)



అది అటకెక్కలేదు..: బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశం ముగిసిపోలేదని, దాని కోసం ప్రయత్నం చేస్తూనే ఉంటామని మహేశ్ గౌడ్ చెప్పారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న విధంగా సర్పంచ్ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెద్దఎత్తున తగ్గలేదని, కేవలం 0.5 శాతం మాత్రమే తేడా వచ్చిందన్నారు. దీనిపై త్వరలోనే ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు, అయితే, బీసీ సంఘాలు గాంధీభవన్ వద్ద ధర్నాలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు.
'మీరు వెళ్లాల్సింది బీసీ రిజర్వేషన్లకు అడ్డు తగిలిన బీజేపీ నేతల ఇళ్లకు. అలాగే, పైకి మద్దతిచ్చి లోపల అడ్డుతగులుతున్న కేటీఆర్, హరీశ్‌రావుల ఇళ్లకు. కిషన్‌రెడ్డి ఇంటి తలుపులు తట్టండి' అని బీసీ సంఘాలనుద్దేశించి మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. మంత్రి కోమటిరెడ్డిని ఉద్దేశించి నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాశ్ నేత చేసిన వ్యాఖ్యలను సమర్థించబోనని అన్నారు. అయితే, కోమటిరెడ్డిని కలిసి వివరణ ఇచ్చినట్లు కైలాశ్ తనకు చెప్పారన్నారు. ఎంఐఎం విషయంలో బీజేపీ వ్యాఖ్యలు ఎప్పుడూ ఉండేవేనని, రోజుకు రెండుసార్లు ఎంఐఎంను, ఒవైసీలను తలుచుకోనిదే ఆ పార్టీ నేతలకు నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.

# రెండో రోజు పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది

(మొదటి పేజీ తరువాయి)







పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండోరోజు జోరందుకున్నది. శనివారం ఒక్క రోజే గడువు ఉండటంతో శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. తొలివిడత ఎన్నికల నిర్వహణ కోసం గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి నోటిఫికేషన్ జారీచేయగా నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. తొలివిడతలో 4,236 సర్పంచ్ స్థానాలకు, 37,440 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 796 నామినేషన్లను అభ్యర్థులు అందజేశారు. అత్యల్పంగా ములుగు జిల్లాలో 63, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 93 నామినేషన్లు వచ్చాయి. తొలి విడత ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల శనివారం సాయంత్రం ఐదు గంటలతో ముగియనున్నది. 30న నామినేషన్ల పరిశీలన, అదేరోజు సాయంత్రం 5 గంటలకు చెల్లుబాటైన నామినేషన్ల అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత అదేరోజు బరిలో నిలిచి అభ్యర్థుల తుదిజాబితాను అధికారులు ప్రకటిస్తారు.




# తెలంగాణలో రైల్వే ఆధునికీకరణకు కొత్త ఊపు వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిరోజూ ఈ స్టేషన్ ద్వారా సుమారు 5,400 మంది ప్రయాణికులు సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. 16 స్పెషల్ ట్రైన్లు సంక్రాంతి పండుగ సమయంలో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఇక్కడ ఆగబోతున్నాయని చెప్పారు కొమురవెల్లి రైల్వేస్టేషన్ నిర్మాణం దాదాపుగా పూర్తయ్యిందన్నారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా త్వరలో ప్రారంభించబోతున్నట్టు చెప్పారు. ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌ను యాదాద్రి వరకు పొడిగించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. కాజీపేటపరిధిలో నిర్మి స్తున్న రైల్వే మల్టీ మ్యాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులను శని వారం పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల వ్యూహంపై సీఎం


హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దాదాపు గంటసేపు జరిగిన ప్రత్యేక భేటీలో పంచాయతీ ఎన్ని కలు, ప్రజాపాలన వారోత్సవాల గురించి ఇరువురు చర్చించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగినట్టు తెలిసింది. చట్టబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేని పరిస్థితుల్లో పార్టీ పరంగా ఆ మేరకు రిజర్వేషన్ల కల్పనపై సాధ్యాసాధ్యాల గురించి వీరు చర్చించినట్టు సమాచారం.
ఈ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ చోట్ల బీసీలకు అవకాశం వచ్చేలా చూడాలని, సర్పంచ్ స్థానాలకు పోటీ పడే ఇతర వర్గాల నేతలకు నచ్చచెప్పాలని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించినట్టు తెలిసింది. అదే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన వారోత్సవాల్లో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాలుపంచుకునేలా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా పార్టీ పక్షాన పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.
అందులో భాగంగా డిసెంబర్ రెండవ తేదీన గాంధీభవన్‌లో డీసీసీ అధ్యక్షులుగా కొత్తగా నియామకమైన నేతలతో సమావేశం నిర్వహించాలని, అదే రోజు టీపీసీసీ కార్యవర్గ సమావేశం కూడా నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సీఎం, పీసీసీ చీఫ్‌లు నిర్ణయించారు. మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్ష తన జరగబోయే ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొంటారు.

# పంచాయతీ ఎన్నికలు నిలవవు

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను అడ్డుకోలేమని హైకోర్టు సీజే ధర్మాసనం తేల్చిచెప్పింది. పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు 50 శాతానికి పరిమితం చేస్తూ ఇచ్చిన జీవో 46 నిలిపివేతకు నిరాకరించింది. రాజ్యాంగ నిబంధన ద్వారా జారీచేసిన ఉత్తర్వుల్లో జోక్యం కూడదని, ఎన్నికల నిలిపివేత సరికాదని సుప్రీంకోర్టు పదేపదే చెప్పిన విషయాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285(ఏ) ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీల్లేదని చెప్పింది.
ఈ నెల 22న ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, శ్రీ మడివాల మాచదేవ రజకుల సంఘంతోపాటు మరో ముగ్గురు ఈ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'బీసీ, ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్ల కోసం పంచాయతీరాజ్ శాఖ జీవో 46ను జారీ చేసింది. పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 9(4) ప్రకారం.. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లో బీసీ-ఏ, బీ, సీ, డీలకు కేటగిరీ వారీగా రిజర్వేషన్లు కల్పించలేదు. డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలి'అని కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే జారీ అయ్యిందన్నారు. నామినేషన్ల స్వీకరణ కూడా జరుగుతోందని, ఈ సమయంలో జోక్యం సరికాదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

**ఆ నివేదిక బహిర్గతం చేస్తే నష్టమేంటి?**


బీసీలపై అధ్యయనం చేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక బహిర్గతం చేస్తే వచ్చే నష్టమేంటని సర్కార్‌ను న్యాయమూర్తి జసి□ట్స్ టి.మాధవీదేవి ప్రశ్నించారు. కవరింగ్ లేటర్, కమిషన్ చైర్మన్ సంతకం లేకుండా నివేదిక కోర్టుకు సమరోపంచడాన్ని తప్పుబట్టారు. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై న్యాయమూర్తి శుక్రవారం విచారణ చేపట్టారు. రిజర్వేషన్ల ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా లేనందున ఎన్నికలను నిలిపివేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది, మాజీ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదించారు.
ప్రస్తుతం స్టే ఇవ్వకుంటే.. తర్వాత పిటిషనర్‌కు అనుకూలంగా తీర్పు వచ్చినా అప్పటికే ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత జోక్యం చేసుకోవద్దని ఏజీ కోరారు. డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పించిన తీరు సరికాదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. సీజే ధర్మాసనం ముందు కూడా పిటిషన్లు ఉన్నందున ఇప్పుడు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమన్నారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, విచారణ 4 వారాలకు వాయిదా వేశారు.

# టి–రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ భద్రతా ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు శాఖ నుండి వారికి ఎలాంటి సహాయ సహకారాలు ఇవ్వాలి అనేదానిపై నిర్వాహక కమిటీ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సదస్సుకు సుమారు 2,500 మంది పోలీసు బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్స్తో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.
ఈ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. ఈ గ్లోబల్ సమ్మిట్ కి అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల ప్రతినిధులు, బహుళ సంస్థల అధినేతలు, దేశీయ సంస్థల ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాలతో కలిపి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు.

వీరి సహాయక సిబ్బంది సుమారు మూడు వేల మంది రానున్నారు. వీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుంది. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్కు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, రూట్ మ్యాప్ లు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయి. మహిళా పారిశ్రామికవేత్తలు, వక్తల, పెట్టుబడిదారుల భద్రత, రక్షణ కోసం ఉమెన్స్ వింగ్, షీ టీమ్స్ ప్రత్యేకంగా వింగ్ నీ ఏర్పాటు చేశారు.






# దిత్వా తుఫాను ప్రభావం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాను నెమ్మదిగా కదులుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను ఆదివారం పుదుచ్చేరి తీరానికి చేరుకునే అవకాశమున్నదని అధికారులు అంచనా వేశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతుందని చెప్పారు. ఈ నెల 30 వరకు ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన చలి గాలులు వీచే అవకాశమున్నదని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తిరిగి 9 నుంచి 11 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోయే అవకాశాలుంటాయని అంచనా వేశారు.
హైదరాబాద్‌లోనూ 3 రోజులపాటు రాత్రి ఉష్ణోగ్రతలు 11 నుంచి 14 డిగ్రీలుగా నమోదవుతాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. తుఫాను కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశమున్నట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 2 నుంచి 5 వరకు రాష్ట్రంలోని దక్షిణ, తూర్పు జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని అధికారులు చెప్పారు. ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నదని తెలిపారు. చలి, వర్షాల నేపథ్యంలో ప్రజలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఎన్నికల విధులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలి..

◆ **సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు**

**ఖమ్మం బ్యూరో , నవంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** ఎన్నికల విధులను అధికారులు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు అన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, పంచాయతీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, ఎంసిఎంసి సెల్, మీడియా సెంటర్లను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల కమీషన్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని, నిబంధనలను రూపొందించిందని వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయడం మన కర్తవ్యమని అన్నారు. 1077 టోల్ ఫ్రీ నెంబర్, సామాజిక మాధ్యమాలలో, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే క్షేత్ర స్థాయిలో ఉన్న బృందాలకు తెలియజేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో పనిచేసే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలైన్స్ బృందాల వివరాలను నోటీస్ బోర్డు ద్వారా తెలియజేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికలకు సంబంధించి నిరంతరం పర్యవేక్షణ జరగాలని, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వచ్చే ప్రతి ఫిర్యాదును రిజిస్టర్ లో నమోదు చేసుకుని వెంటనే క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలకు సమాచారం అందించాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో ఎన్నికల నిర్వహణ పట్ల అపోహలు కలిగే దుష్ప్రచారాలు గమనించిన వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమాచారం చేరే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బృందం మూడు షిఫ్టులలో 24 గంటల పాటు పనిచేస్తుందని, దానికి అనుగుణంగా సిబ్బంది నియామకం, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, డీపీఆర్ఓ ఎం.ఏ. గౌస్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు మురళి, రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెల్టూర్ గ్రామంలో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం



◆ **బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి అశోక్ (చిట్టి)**

**పెద్దమందడి,నవంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి బిఆర్ఎస్ పార్టీ తరఫున అశోక్ (చిట్టి) శుక్రవారం నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. గ్రామంలో పార్టీ కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నామినేషన్ వేడుక ఊరేగింపు తరహాలో జరిగింది.మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి అశోక్ భారీ ర్యాలీగా బయలుదేరి గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారికి తన మొదటి నామినేషన్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా అశోక్ (చిట్టి) మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల మద్దతుతో విజయం సాధిస్తానన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. వెల్టూర్ గ్రామ అభివృద్దే తమ ప్రధాన ధ్యేయమని, ప్రజాసేవలో పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. వెల్టూర్ గ్రామంలో బిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అశోక్‌కు తమ మద్దతును తెలియజేశారు.





# ఖమ్మం మానస కాంప్లెక్స్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఆవిర్భావం

## మాచర్ల తిరుమలరావు

**ఖమ్మం బ్యూరో,నవంబర్28, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం మానస కాంప్లెక్స్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఆవిర్భావం సందర్భంగా అధ్యక్షులు మాచర్ల తిరుమలరావు, మాట్లాడుతూ,పెయింటింగ్ యూనియన్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే శుభ దినం నేడు, సభ్యుల ఆశీర్వాదాలతో, అత్యంత విశ్వాసంతో మా ఏడుగురిని ఎన్నుకోవడం మాకు లభించిన గొప్ప గౌరవం. మా మీద విశ్వాసం ఉంచిన ప్రతి సభ్యునికి పేరు పేరు న హృదయపూర్వక వందనాలు తెలియజేస్తున్నాను. నేడు జరిగిన కార్యక్రమం మన పెయింటింగ్ యూనియన్ శక్తి, ఏకత, ఐక్యతకి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమం సందర్భంగా సభ్యులందరూ భారీగా హాజరై, ఉత్సాహపూర్వకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన భవ్యమైన బైక్ ర్యాలీ, మన యూనియన్ శక్తి, ఉత్సాహం, సంకల్పాన్ని ప్రతిబింబించింది. బైకులతో తాండవించిన ఈ ర్యాలీ ప్రజల దృష్టిని ఆకర్షించి, మన సంఘం శక్తివంతమైన ఐక్యతను ఖమ్మం జిల్లాకు చాటిచెప్పింది.

మమల్ని సభ్యులు, అభిమానులు, పెద్దలు ప్రేమతో, ఆదరాభిమానంతో చేసిన పాలాభిషేకాలు, కార్యక్రమాన్ని మరింత వైభవంగా మార్చాయి. ఆ క్షణాలు మా జీవితంలో మరచిపోలేని చారిత్రాత్మక క్షణాలుగా నిలిచిపోతాయి. ఈ ప్రేమాభిషేకాన్ని మేము కేవలం గౌరవంగా మాత్రమే కాకుండా ఒక బాధ్యతగా, ఒక ధర్మంగా భావిస్తున్నాము. ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన విషయం మన ఖమ్మం మానస కాంప్లెక్స్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కు లభించిన కొత్త రిజిస్ట్రేషన్ నెంబర్ ఎ/319/ డి.వై.సి.ఎల్ ఖమ్మం/2025 మన ప్రయాణంలో ఒక స్వర్ణాక్షర ఘట్టం.

ఈ రిజిస్ట్రేషన్ నంబర్ మన పెయింటింగ్ యూనియన్ కు చట్టబద్ధత, ఆధికారికత, విశ్వసనీయత అనే మూడు, బలమైన స్తంభాలను ఇచ్చింది. ఈ నెంబర్‌తో మన అన్ని సేవా కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంబంధిత వ్యవహారాలు మరింత పారదర్శకంగా మరియు సమర్థవంతంగా అమలవుతాయి. ఇది మన పెయింటింగ్ సంఘానికి ఒక కొత్త వెలుగు, కొత్త దీప్తి, కొత్త భవిష్యత్ దిశ. బాబురావు పెట్రోల్ బంక్ దగ్గర నుండి జడ్పీ సెంటర్ వరకు బైక్ ర్యాలీతో జై పెయింటర్ జై జై పెయింటర్ అంటూ, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, పెయింటర్ల ఐక్యత వర్ధిల్లాలి అని, భారీగా నినాదాలు ఇస్తూ, జెడ్పి లో గల అంబేద్కర్ విగ్రహానికి, పెద్ద పూలదండ వేయడం జరిగింది. మేము సాధించుకున్న రిజిస్ట్రేషన్ నెంబర్ ను ఎంతో ఆనందంగా బాంబులు కాలుస్తూ, కార్యక్రమానికి హాజరైన సభ్యులందరికీ తెలియజేయడం జరిగింది.

ఈ రోజు జరిగిన కార్యక్రమాన్ని మరింత ప్రత్యేకం చేసిన అంశం సభ్యుల ఐక్యత. యువత నుంచి పెద్దల వరకు, అందరూ ఒకే తాటిపై నిలబడి, కార్యక్రమాన్ని ఘనవంతం చేయడం మన ఖమ్మం మానస కాంప్లెక్స్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ బలం ఎంత గొప్పదో మరోసారి నిరూపించింది..ప్రతి చిరునవ్వు, ప్రతి జైకొట్టు, ప్రతి పువ్వు, ప్రతి అభినందన మన సంఘం శక్తికి ప్రతీక. అధ్యక్షుడి బాధ్యతగా, నేను చేసే ప్రతి పని సభ్యుల అభ్యున్నతికే అంకితం. మొదటగా నా కార్యచరణలో భాగంగా, 1)సభ్యుల సమస్యల పరిష్కారం. 2)సేవా కార్యక్రమాల విస్తరణ. 3)మన పెయింటింగ్ యూనియన్ కు ఉపయోగపడే కార్యక్రమాలు. చేపట్టడం ఇవన్నీ మా కార్యాచరణలో ముఖ్య ప్రాధాన్యత పొందనున్నాయి. ఈరోజు జరిగిన భవ్య కార్యక్రమం మన పెయింటింగ్ యూనియన్ కు కొత్త శక్తిని, మాకు కొత్త బాధ్యతను, మా ప్రయాణానికి కొత్త దిశను ఇచ్చింది. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, నిబద్ధతతో, నిస్వార్థ సేవతో, ప్రకాశవంతమైన భవిష్యత్తు వైపు ముందుకు నడిపిస్తామని మేము హామీ ఇస్తున్నాము. మనందరం కలిసి సంఘ బలం, సేవ ధర్మం, అభివృద్ధే లక్ష్యం అనే సంకల్పంతో ముందుకు సాగుదాం. ఖమ్మం మానస కాంప్లెక్స్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ సభ్యులుగా,గుంజులూరి వెంకటేశ్వర్లు గౌరవ అధ్యక్షులు, మాచర్ల తిరుమలరావు అధ్యక్షులు, మేడబోయిన రమేష్, ఉపాధ్యక్షులు, మాలోత్ సురేష్, ప్రధాన కార్యదర్శి, కత్తుల శ్రీను, సహాయ కార్యదర్శి, వారగని రమేష్ కోశాధికారి. ఈ కార్యక్రమంలో పెద్దలు కోటపర్తి మాధవరావు, పూరండ్ల యాకయ్య, పేరాల రామచంద్రు, కలకోట వెంకటేశ్వర్లు, కుక్కల జోసెఫ్, కాలేపోగు వెంకట్రావు, షేక్ దస్తగిరి పాషా, నాగేశ్వరరావు లంజపెల్లి క్రాంతి, క్యాంప్ వెంకటేశ్వర్లు, దుబ్బాకుల కృష్ణ, కుక్కల స్వామి, మధు, యాకూబ్, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణ, శ్రీకాంత్, బాబు శేఖర్, వీరేషం యూసుఫ్, అన్వర్, చంటి, పాషి, రాము,సాయి, షహేన్షా, దుర్గారావు పవన్ మరియు పెయింటింగ్ మేస్త్రీలు వర్కర్ సోదరులు పాల్గొన్నారు.

# వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా వడ్డే శేఖర్ నామినేషన్



**పెద్దమందడి,నవంబర్28(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వడ్డే శేఖర్ శుక్రవారం మొదటి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా వడ్డే శేఖర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని పోటీ చేస్తున్నానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. శుభ్రత, నీటి సదుపాయాలు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో మీ అందరి ఆశీస్సులు, మద్దతు నాకు అత్యంత అవసరం. గ్రామ అభివృద్ధి కోసం, వెల్టూర్ కు మరింత మంచి రోజులు తీసుకురావడానికి నన్ను సర్పంచ్ గా గెలిపించాలని గ్రామ ప్రజలను కోరుతున్నాను. మీ నమ్మకానికి తగిన విధంగా పని చేసి, గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తాను అని వడ్డే శేఖర్ తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలపరిచినందుకు వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నామినేషన్ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైనిక్ పూరిలో పూలే వర్ధంతి.. సందర్భంగా విగ్రహానికి నివాళులర్పించిన స్ఫూర్తి గ్రూప్




**ఏ ఎస్ రావు నగర్, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సైనిక్పురి చౌరస్తాలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించిన ఈకార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు కోమటి రవి మాట్లాడుతూ, అట్టడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్య అందించేందుకు పూలే నిర్మించిన విద్యాసంస్థలు వేలాది మంది జీవితాలను మార్చాయని గుర్తుచేశారు. మనువాదం కారణంగా మహిళలు, శూద్రులకు విద్య దూరమైన సమయంలో తన భార్యకు విద్య నేర్పి, దళిత బాలికలకు బోధించేలా చేసిన పూలే కృషి చారిత్రాత్మకమని అన్నారు. వారి సేవలను అడ్డుకునేందుకు అప్పటి బ్రాహ్మణీయ భావజాలం గల వర్గాలు ప్రతిఘటన చేసినప్పటికీ, పూలే వెనుదిరగలేదని తెలిపారు.అధ్యక్షుడు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ పూలే చేసిన సామాజిక సేవలను నేటికీ కొందరు మనువాదులు మరుగునపర్చడానికి ప్రయత్నించినా, వారి ఆలోచనలు ప్రజల్లో ఉద్యమంగా కొనసాగుతున్నాయని అన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ, మనువాద భావజాలంతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తున్నదని విమర్శించారు. ఆర్‌ఎస్ఎస్-బీజేపీ నిచ్చెన మెట్ల సంస్కృతిని తెరపైకి తేవాలనే కుట్రలు చేస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు కమలనగర్ సీఐటీయూ కార్యాలయ ప్రాంగణంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజలందరూ కుటుంబసమేతంగా హాజరై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు.కార్యక్రమంలో పులే-అంబేద్కర్ స్ఫూర్తి గ్రూప్ నాయకులు పి. మల్లేశం, ఎం. భాస్కర్ రావు, సామాజిక ఉద్యమ నాయకులు జి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎస్‌టీ బృందానికి సూచనలు.!



## ఏసీపీ వసుంధర యాదవ్

**సత్తుపల్లి, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ శుక్రవారం డివిజన్‌లోని ఎస్ఎస్‌టీ తనిఖీ కేంద్రాన్ని సందర్శించి బృందం పనితీరును పరిశీలించారు. వాహనాల తనిఖీల విధానం, సిబ్బంది బాధ్యతల పంపిణీ, వీడియో చిత్రీకరణతో పాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తున్న తీరు గురించి ఆమె సమీక్ష నిర్వహించారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి తనిఖీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఎన్నికలకు సంబంధించి ఏ రకమైన ఉల్లంఘన జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌టీ బృందానికి ఆమె సూచించారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ప్రభుత్వం అందించిన సాయం సద్వినియోగం చేసుకోవాలి

- **వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు.**

**హసన్ పర్తి, నవంబర్ 28(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామ మరుపాక అనిత – శివ దంపతులు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన ₹5 లక్షల ఆర్థికసహాయంతో గృహ నిర్మాణాన్ని పూర్తిచేసుకున్నారు. వినూత్న రీతిలో ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు చిత్రపటాలతో గృహప్రవేశ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు పాల్గొని రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించి కుటుంబ సభ్యులకు వస్త్రాలు అందించి ఆశీర్వదించారు.తదనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా గృహరహితులకు ఇళ్లు కల్పించేందుకు భారీగా నిధులు కేటాయించడం ద్వారా వేలాది కుటుంబాలకి సొంతిల్లు కలనే నిజం అవుతోంది.ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో నాణ్యతతో పాటు వేగవంతంగా పనులు పూర్తి చేసేలా అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.లబ్ధిదారులు కూడా ప్రభుత్వం అందించిన సాయం సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని అన్నారు.

అలాగే గ్రామాభివృద్ధి,మౌలిక వసతుల విస్తరణకు సమగ్ర ప్రణాళికతో పనిచేస్తామని,ప్రతి ఇంటి సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు,పిఎసిఎస్ చైర్మన్ రాజేష్ గౌడ్,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ సముద్రాల మధు,గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్పోలు రవి,మారుతా రవి,రమేష్ రెడ్డి అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# మహాత్మా జ్యోతి రావు ఫూలే వర్ధంతి ..

- **విగ్రహానికి పూలమాల అర్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఏ ఎస్ రావు నగర్, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మనిషి ఎదుగుదలకు, సమాజ పురోగతికి విద్యే ప్రధాన ఆధారం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సైనిక్‌పురి చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలే విగ్రహానికి పూలమాల అర్పించారు.అణగారిన వర్గాల విద్యా అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన పూలే నిజమైన మానవతావాది అని ఎమ్మెల్యే అన్నారు. “చదువు లేనిదే జ్ఞానం లేదు, జ్ఞానం లేనిదే పురోగతి లేదు” అనే నిజాన్ని గ్రహించి, 19వ శతాబ్దంలోనే నిమ్న వర్గాలు, మహిళల కోసం దేశంలోనే తొలి పాఠశాలలను స్థాపించిన మహనీయుడు పూలే అని గుర్తుచేశారు.సామాజిక దురాచారాలు, మూడనమ్మకాలు, కుల వివక్ష వంటి అడ్డంకులను విద్య ద్వారానే అధిగమించవచ్చని పూలే చాటి చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అణచివేతకు గురైన వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపి, వారి హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని ఆయన అన్నారు.ఈకార్యక్రమంలో డా. ఏ ఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, కాప్రా డివిజన్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మల్లేష్, వంశీ రాజు తదితరులు పాల్గొన్నారు.






# సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ బన్నాల

**చిలుకానగర్, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిలుకానగర్ డివిజన్‌లో సుమారు 36 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సిసి రోడ్ పనులను పర్యవేక్షించారు. జిహెచ్ఎంసి అధికారులు, రాఘవేంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆమె పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడిన కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ “ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. సిసి రోడ్ నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత అత్యవసరం. జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి. నిర్మాణ సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యతలో ఏమైనా లోపాలు చోటు చేసుకున్నా కఠిన చర్యలు తప్పవు” అని తెలిపారు.కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ కోకొండ, కొందల జగన్, పల్లె వేణు గౌడ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బంటి గౌడ్, చిన్న, రాఘవేంద్ర నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ రాములు, ముకుందరావు, అడ్వకేట్ శ్రీనివాస్ రావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ లా&అర్డర్



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ సెంటర్ ను అదనపు డిసిపి (లా&అర్డర్) ప్రసాద్ రావు సందర్శించారు. రఘునాధపాలెం, కోయచిలక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.



## పంచాయతీ ఎన్నికలపై ప్రజలకు అవగాహన



- **ఏసీపీ రూరల్ తిరుపతిరెడ్డి**

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా పోలీసులకు సహకరించాలని ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ ఆదేశాల మేరకు రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ముదిగొండ గ్రామ ప్రజలతో మమేకమై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ అండగా ఉంటుందని, ప్రజా రక్షణ, భద్రత పోలీసుల లక్ష్యమని అన్నారు. గ్రామాలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు.





## అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమైన రాజయ్య గౌడ్ కుటుంబానికి వల్బాపూర్ గ్రామస్తుల అండ

- **మానవత్వం మరోసారి మెరవగా... రూ.21,865 ఆర్థిక సహాయం అందజేత**

**ఎల్కతుర్తి, నవంబర్ 28: (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో చిర్ర రాజయ్య గౌడ్ కుటుంబం పూర్తిగా నిరాశ్రయులైన విషయం తెలిసిందే. చిన్నపాటి ఇల్లు, గృహోపకరణాలు, దినసరి వాడుక సామగ్రి అన్నీ మంటల్లో దగ్ధమై తీవ్ర ఆర్థిక నష్టం జరిగింది.

ఈ ఘటనతో ఆర్థికంగా నిలదొక్కుకోవడంలో ఇబ్బంది పడుతున్న కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామ పెద్దలు, యువత, మహిళలు ముందుకు వచ్చారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి మొత్తం రూ. 21,865లను రాజయ్య గౌడ్ కుటుంబానికి అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, “ఇలాంటి సందర్భాల్లో బాధిత కుటుంబానికి గ్రామం మొత్తం అండగా ఉండటం మన బాధ్యత. మనం ఇచ్చే చిన్న సహాయం అయినా, వారికి ఇది ప్రస్తుతం అత్యవసరమైన సమయాల్లో పెద్ద తోడ్పాటు” అని పేర్కొన్నారు.

సహాయాన్ని అందజేసిన గ్రామ యువత, పెద్దలు, మహిళలకు రాజయ్య గౌడ్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సంఘటన గ్రామస్థుల పరస్పర సహకారం, మానవత్వం ఇంకా సజీవంగా ఉన్నదని చూపించిన ఉదాహరణగా నిలిచింది. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# టి–రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు భారీ బందోబస్తు

◆ రాచకొండ సిపి జి. సుధీర్ బాబు

**మహేశ్వరం, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న టి–రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కోసం పోలీసుశాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లలో మునిగింది. శుక్రవారం మహేశ్వరంలో రాచకొండ సిపి జి. సుధీర్ బాబు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, టీజీ ఐసీసీ శశాంక్, మిర్యాన్ పేట డీసీపీ నారాయణ రెడ్డి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి తదితరులు సమన్వయ సమావేశం నిర్వహించి, సమ్మిట్ నిర్వహణ కమిటీ సభ్యులతో భద్రత, మౌలిక వసతులపై చర్చించారు.సమ్మిట్ కోసం సుమారు 2,500 మంది పోలీస్ బలగాలు, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్ వంటి విభాగాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. వీవీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సమ్మిట్ ప్రాంతంలో వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, సెంట్రల్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం 1,000 మంది ట్రాఫిక్ పోలీసులు, రహదారుల మళ్లింపు, రూట్ మ్యాప్లు, బారికేడ్లు, వాహనాల పార్కింగ్ నిర్వహణ కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించబడ్డారు. రెండు రోజులపాటు సాధారణ ప్రజలు, వాహనదారులు సౌకర్యం పొందేలా మార్గాలు మళ్లింపు చర్యలతో అందుబాటులో ఉంటాయి. సమ్మిట్‌కు సుమారు 600 మంది అంతర్జాతీయ, దేశీయ ప్రతినిధులు హాజరవుతున్నారని అధికారులు తెలిపారు. వీరి సహాయక సిబ్బంది మూడు వేల మందికి పైగా ఉంటారు. మహిళా పారిశ్రామికవేత్తల, వక్తల, పెట్టుబడిదారుల భద్రత కోసం ఉమెన్స్ వింగ్, షీ టీమ్స్ ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు.రాజ్యాధికారుల సమన్వయంతో, సమ్మిట్ ప్రాంతంలో బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు సిద్ధంగా ఉంటాయి. ఈ ఏర్పాట్లు అంతర్జాతీయ స్థాయిలో సమ్మిట్ సాఫీగా నిర్వహించడానికి కీలకం అవుతున్నాయి.




# కొమ్మేపల్లి కాలనీలో క్రైస్తవ ప్రార్థనా మందిరం నిర్మాణం

సింగరేణి సౌజన్యంతో..

**సత్తుపల్లి, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** సింగరేణి సంస్థ ఆర్ అండ్ ఆర్ అభివృద్ధి కార్యక్రమాల భాగంగా కొమ్మేపల్లి కాలనీలో 16 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన క్రైస్తవ ప్రార్థనా మందిరాన్ని శుక్రవారం సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొన్నారు. ప్రార్థనా మందిర నిర్మాణానికి సింగరేణి సి అండ్ ఎండి ఎన్. బలరాం, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పి&పీ) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పిఏ అండ్ డబ్ల్యూ) గౌతమ్ పొట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) తిరుమలరావు, సత్తుపల్లి ఏరియా జీఎం సిహెచ్. శ్రీనివాస్ తదితరులు సహకారం అందించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా జీఎం చిన్నోల శ్రీనివాస్, జెవిఆర్ ఓసీ ప్రాజెక్టు అధికారి ఎన్విఆర్ ప్రహ్లాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఏఎంసీ చైర్మన్ ఆనంద్ బాబు, ఏరియా పర్యావరణ అధికారి తోట సత్యనారాయణ, ఉప ఇంజనీర్ (సివిల్) ఏ. రవికుమార్, సంక్షేమ అధికారి కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.కొమ్మేపల్లి కాలనీ నివాసులైన మరసకట్ల దేవదాసు, పచ్చినీళ్ల ఇర్మియ, బి. రెడ్డి కృష్ణారెడ్డి, ఎస్.కే. సుభాని, పి. శ్రీను, ఎస్.కే. బాజీ, ఎస్.కే. షఫీ తదితరులు ప్రార్థనా మందిర ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# ముఖ్యమైన పత్రాలు పడిపోవడంతో బాధితుడి ఆవేదన

పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు

**పెద్దమందడి,నవంబరు28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెలటూరు గ్రామానికి చెందిన చిన్నా నాగయ్య కావలి, తండ్రి పేరు పకీరన్న, నేను ప్రతిరోజూ ప్రైవేట్ పనుల కోసం వనపర్తికి వెళ్ళుతూ ఉంటాను. ఆ మార్గ మధ్యలో, నా ప్లాట్‌కు సంబంధించిన ఒరిజినల్ బాండ్, భూమి పాసుబుక్, ఆధార్ కార్డు మరియు ఇతర ముఖ్యమైన పత్రాలు పడిపోయి కనిపించడం లేదు.వనపర్తి వద్ద పరిశీలించినప్పటికీ, ఈ పత్రాలు ఏవీ లభించలేదు. ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ వాటి ఆచూకీ దొరకలేదు. కనబడని దస్తావేజులు, పత్రాల వివరాలు ఒరిజినల్ ప్లాట్ డాక్యుమెంట్ నెంబర్: 1610/2010 ప్లాట్ విక్రయ దస్తావేజు



లు రిజిస్ట్రేషన్ నెంబర్:12537/2009, మిస్సింగ్ సర్టిఫికెట్ నెంబర్ 1520011125121706 5236, ఈ విషయమై, నేను 04112025 (మంగళవారం) న పెద్దమందడి పోలీస్ స్టేషన్ లో స్థానిక ఎస్సై కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించాను.పై పత్రాలు ఎవరికైనా దొరికినట్లయితే, దయచేసి నా ఫోన్ నెంబర్ 99639 40210 ద్వారా సమాచారం అందించాలని బాధితులు కోరుతున్నారు.

# కడియం జాగ్రత్త బిడ్డా!

- అది నోరా మోరా..!నాలుక కోసేస్తాం
- రేవంత్ తొత్తువి నువ్వు..
- బీఆర్ఎస్‌పై నోరు జారితే క్షమించం
- గ్లోబల్ ప్రచారం నీ మార్క్... అభివృద్ధి మా మార్క్
- పౌరుషం ఉంటే ముందుగా రాజీనామా చెయ్!
- కేసీఆర్‌పై మాట్లాడే స్థాయి నీది కాదు కడియం
- యూత్ ఐకాన్ కేటీఆర్‌ను విమర్శించే ధైర్యం నీదా..?
- ఘన్‌పూర్ బిడ్డగా గర్వంగా చెప్పకుంటున్నాను
- ఉద్యమ స్ఫూర్తి మళ్లీ రగిలించాల్సిన సమయం వచ్చింది
- గులాబీ జెండా మళ్లీ ప్రతి గ్రామంలో ఎగరాలి
- కడియంపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఫైర్

**స్టేషన్ ఘనపూర్, నవంబర్28(తెలంగాణ ముచ్చట్లు):**

స్టేషన్ ఘన్ పూర్ డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ...ఈ సందర్భంగా కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కౌహరం ఎక్కి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నావు. నోరుకు వచ్చిందే మాట్లాడుతున్నావు... అది నోరా, మోరా? అని మండిపడ్డారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే జాగ్రత్త...నాలుక కోస్తాం అని హెచ్చరించారు.

**రేవంత్ రెడ్డికి తొత్తుగా కడియం**

ఈ నీచుడు పీరాయింపులకు ఐకాన్...నీకు బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. మీ అయ్య ఎవరో ముందుగా చెప్పు అని సూటిగా ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టే ప్రశ్నిస్తున్నాం. సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీది. కానీ నువ్వు కాంగ్రెస్‌లో చేరి పూర్తిగా రేవంత్ రెడ్డి తొత్తుగా మాట్లాడుతున్నావు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చని పరిస్థితిలో బీఆర్ఎస్‌పై విమర్శించడం సిగ్గుచేటు అని అన్నారు. తులం బంగారం ఇచ్చావా? స్కూటీలు ఇచ్చావా? పింఛన్లు పెంచావా? రైతుభీమా ఇచ్చావా? ఏ మొఖం పెట్టు కుని ప్రజల్లో తిరుగుతున్నావు? అంటూ ఘాటుగా ప్రశ్నించారు.

**కేసీఆర్‌పై మాట్లాడే స్థాయి నీది కాదు..**

తెలంగాణ రాష్ట్ర సాధన, ఉద్యమం, ప్రజల కోసం కేసీఆర్ చూపిన పట్టుదల దేశం మొత్తం తెలుసు. ఆయన కరుణ జన్ముడు. సమైక్య ఉద్యమంలో సావు నోట్లో తెలపెట్టిన నాయకుడు. దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దిన మహానేత. ఆయన తెలంగాణ జాతిపిత. ఆయన గురించి మాట్లాడే స్థాయి నీది కాదు.అని రాజయ్య పేర్కొన్నారు.

**తండ్రి తగ్గ తనయుడు కేటీఆర్**

పిన్నింటి వాసాలు లెక్కపెట్టిన కడియం... రాష్ట్ర ప్రజలు గౌరవించే యూత్ ఐకాన్ కేటీఆర్ గురించి మాట్లాడే స్థాయి నీది కాదు.



కేటీఆర్ ఇంటర్నేషనల్ రికగ్నిషన్ పొందిన నాయకుడు. తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి చాటిన యువ డైనమిక్ లీడర్. రాష్ట్రాన్ని గ్లోబల్ మ్యాప్‌పై నిలిపాడు. నీ విమర్శలు అన్నీ అసత్య ప్రచారమే అని రాజయ్య అన్నారు.

**మోసం చేయడంలో నువ్వు టాల్ మ్యాన్**

సిగ్గు, శరం లేకుండా ఏడాది క్రితమే కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు పెద్ద పెండ్యాల సభలో ఒప్పుకున్నావు. పీరాయింపుల్లో టాల్ మ్యాన్ నువ్వు. మోసం చేయడంలో టాల్ మ్యాన్ నువ్వు. ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజ లను ముంచడంలో నువ్వే టాల్ మ్యాన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఘన్‌పూర్ కోసం చేసినదేమీ లేదు**

13-14 ఏళ్లు మంత్రి,10 ఏళ్లు కేబినెట్‌లో ఉన్నా ఘన్‌పూర్‌లో గుర్తుండే అభివృద్ధి ఏమీ లేదు. నీ బిడ్డకు పదవి మాత్రం ఇప్పించుకున్నావు...ఇంకొక బిడ్డను ఎమ్మెల్యే చేస్తానని బుజ్జగిస్తున్నావు. ప్రజలు అడిగేది నీ పని... నీ కుటుంబ ప్రయోజనం కాదు. కేసీఆర్ నాయకత్వం లో ఘన్‌పూర్‌లో జరిగిన అభివృద్ధి వివరించారు.కంటి వెలుగు, కళ్యాణ లక్ష్మి, రైతు భీమా, రైతు బంధు, జాతీయ అవార్డులు, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, కాళోజీ కళాక్షేత్రం, 150 బెడ్ హాస్పిటల్, ఫ్లై ఓవర్, నేషనల్ హైవే, 100 బెడ్ హాస్పిటల్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు.

**అవకాశవాది కడియం శ్రీహరి..**

అవకాశం ఉన్నప్పుడు వాడుకున్నావు... ఇప్పుడు విమర్శిస్తున్నావు. బిఆర్ఎస్ పార్టీలో డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు కేటీఆర్ దగ్గర పైసాలు అడిగి ఇల్లు కట్టుకున్నావు. 2018 ఎన్నికల్లో గెలిపించడానికి వచ్చిన పార్టీ ఫండ్‌లో సగం బేరాలు వేసి తీసుకున్నావు. అలాంటి మోసగాడు ఇప్పుడు బీఆర్ఎస్, కేటీఆర్ గురించి మాట్లాడతాడా? అని మండిపడ్డారు.

**మంత్రి పదవి కోసం ఎవరి కాళ్లకైనా పడతావు**

మంత్రి పదవి కోసం ఎవరి కాళ్లకైనా పట్టేందుకైనా సిద్ధం. మోడీ పిలిస్తే వెళ్తావు. అప్పుడే రాహుల్‌ను ఐరన్‌లెగ్ అంటావు... రేవంత్‌ను తిట్టే స్తావు. కార్యకర్తలకు మాట్లాడే హక్కు ఉంది కానీ బీఆర్ఎస్‌ను విమర్శించే హక్కు నీకు లేదని ఎద్దేవా చేశారు.

**పౌరుషం ఉంటే ముందుగా రాజీనామా చెయ్యి..**

జూబ్లీహిల్స్‌లో గెలిచానని విర్రవీగుతున్నావు. నిజంగా పౌరుషం ఉంటే ముందుగా రాజీనామా చెయ్యి. ప్రజలు ఇచ్చిన ఎమ్మెల్యే పదవి ప్రజల కోసం త్యాగం చెయ్యి. నాకు పూలదండలు పడ్డాయి... నీకు పూలదండాలా? చెప్పులదండాలా? తెలుస్తుందని అన్నారు.

**ఘన్‌పూర్ బిడ్డగా గర్వపడుతున్నాను..**

స్థానికుడిగా, ఘన్‌పూర్ బిడ్డగా గర్వపడుతున్నాను. ఎస్సీ కాలనీలో ఒక్క గుడిసె కూడా లేనంత అభివృద్ధి చేశాం. ఘన్‌పూర్ నుండి రాజ వరం వరకు 1.58 టీఎంసీ కెపాసిటీ రిజర్వాయర్ ఏర్పాటుకు అప్పటి సీఎం వైఎస్సార్‌తో మాట్లాడి పునాది వేశామని గుర్తుచేశారు. చీటకోడూరు-బొమ్మకూరు ప్రాంతాలకు పారెటట్లు ప్రణాళికతో 1.58 టీఎంసీ నీళ్లు అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కేసీఆర్ ఆశీర్వాదాలతో కాళోజీ హెల్త్ యూనివర్సిటీని ప్రాంతానికి తెచ్చామని చెప్పారు. అదే విధంగా కాళోజీ కళాక్షేత్రం, 150 మంచాల స్పెషల్ హాస్పిటల్, 50 మంచాల పిల్లల అత్యవసర విభాగం, 65 కి.మీ నేషనల్ హైవే, ఫ్లై ఓవర్ బ్రిడ్జ్, ఘన్ పూర్ మున్సిపాలిటీ, 100 బెడ్ హాస్పిటల్ ఇలా అనేక అభివృద్ధి పనులు చేశామని వివరించారు.

**గ్లోబల్ ప్రచారం మాత్రమే నీ మార్క్.**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు సంబంధించిన మట్టి తీసావా? నిధులు లేక మీ సీఎం ఢిల్లీకి అప్పు కోసం తిరుగుతున్నాడు. నీది గ్లోబల్ ప్రచారం మాత్రమే అని రాజయ్య అన్నారు.

**ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ రగిలించాలి..**

హన్మకొండ-జనగామ కేంద్రాల్లో దీక్ష దివస్ నిర్వహించి ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరాలి. ఓటు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్‌కే ఉంది. త్యాగాల పునాదిపై ఎగరిన గులాబీ జెండా మళ్లీ ఎగరాలని రాజయ్య తెలిపారు.ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి మారపాక రవి,సీనియర్ నాయకులు ఆకుల కుమార్ పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం విస్తృత సమావేశం

**ఎల్కతుర్తి, నవంబర్ 28(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల స్వరూప అధ్యక్షత వహించారు.
సమావేశానికి ముఖ్య అతిథిగా హన్మకొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు.
రాజుల రాములు మాట్లాడుతూ, వ్యవసాయ భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి ₹12,000 ఆర్థిక సహాయం అందజేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వైద్యం, విద్యా రంగాల్లో ఇచ్చిన భరోసాలను కూడా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఉపాధి హామీ పథకంలో కూలీలకు వాగ్దానం చేసిన 150 రోజుల పని అందించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 50 రోజుల పని చేసిన కూలీలకు ₹12,000 ఇవ్వాలనే హామీ కూడా అమలు కాలేదని ఆయన తెలిపారు.
సమావేశంలో జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అంబాల స్వరూప, జిల్లా కమిటీ సభ్యురాలు లోకిని స్వరూప, మండల కమిటీ నాయకులు అన్న రాజ్‌కుమార్, ముద్రకోళ వెంకటేష్, గోళ్ళ రాధ, అంబాల రేణుక, జంగం శ్రీను, జంగం రమేష్, చీకటి లక్ష్మి, అంబాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# పోచమ్మ రాళ్ల భూమినీ ప్రభుత్వం స్వాధీనం చేస్తుండడంతో గ్రామస్తుల ఆందోళన

◆ డీసీపీ నారాయణ రెడ్డి మాటతో గ్రామస్తుల నిరసన విరమణ

**మహేశ్వరం, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** మహేశ్వరం నియోజకవర్గ కందుకూరు మండలం బేగరికంచ గ్రామంలో దేవాలయ పొలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తుందనే అనుమానంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోచమ్మ రాళ్ల వద్ద ఉన్న రెండు ఎకరాల భూమిని అధికారులు ఇప్పటికే స్వాధీనం చేసుకోవడంతో, 145 సర్వే నంబర్‌లోని మిగతా భూములను కూడా ప్రభుత్వాధీనంలోకి తీసుకుంటారనే భయంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటానికి పిలుపునిచ్చిన గ్రామస్తుల ఉద్రిక్తతను గమనించిన మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.పి.వి. రాజు, ఫార్మా ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని రెవెన్యూ అధికారులతో చర్చలు జరిపారు.రైతులకు న్యాయం చేస్తామన్న హామీతో, ఏ నిర్ణయమూ రైతుల అనుమతి లేకుండా తీసుకోమని అధికారులు స్పష్టం చేశారు. దీనితో గ్రామస్తులు శాంతించి ఆందోళన విరమించారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# నేడు విద్యుత్ అంతరాయం

**కీసర, నవంబర్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** రాంపల్లి మరియు కీసర సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలలో నిర్వహణ, ఫీడర్ పిఎంఐ పనుల కారణంగా విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలుపు వేయబడును తెలంగాణ విద్యుత్ శాఖ తెలిపింది.రాంపల్లి ఎస్ఎస్ నుండి ఉదయం 11:00నుండి 11:30 వరకు 11 కేవి రామాలయం ఫీడర్ కింద: రాంపల్లి గ్రామం, పాత గ్రామం రాంపల్లి, సాహితీ హర హర వెంట్యూట్, శుభం ఎన్‌క్లేవ్, జై భవానీ కాలనీ, సాయి బాబా నగర్, లక్ష్మీ నగర్, వివిస్టీ కాలనీ, అయ్యప్ప నగర్, రోజ్ గార్డెన్, నీలగిర్ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, సిలికాన్ మెడోస్, ఎలిఫెంట్ ఎన్‌క్లేవ్, ఎన్ఎస్ఆర్ లోటస్ కౌంటీ, ఎలిఫాంట్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిచింది.అలాగే, అదే సమయానికి 11 కేవి శ్రీనగర్ ఫీడర్ కింద రాంపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, చెర్లపల్లి నుండి రాంపల్లి రోడ్, సాయి నగర్, జ్యోతి, డిఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం నమోదైంది.కీసర సబ్‌స్టేషన్ నుండి ఉదయం 11:30 నుండి 12:00 వరకు 11 కేవి వర్ధన ఫీడర్ కింద కుందన్పల్లి మరియు గోదుమకుంట ఏజీఎల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.మధ్యాహ్నం 03:00 నుండి 03:30 వరకు 11 కేవి చీర్యాల్ లక్ష్మీ ఫీడర్ కింద కుందన్పల్లి గ్రామం, వర్ధన పాఠశాల, వికలాంగుల కాలనీ, గోదుమకుంట గ్రామం, ఏజీఎల్ ప్రాంతాల్లో విద్యుత్ అందదు.

మధ్యాహ్నం 02:00నుండి సాయంత్రం 05:00 వరకు 11 కేవి కరీంగూడ్ ఫీడర్ కింద కరీంగూడ్ గ్రామం, శిల్పా వెంచర్, తారక ఎన్‌క్లేవ్, కాకతీయ ఎన్‌క్లేవ్, శుభకర ఎన్‌క్లేవ్, అక్షయ ఎన్‌క్లేవ్, సాహితీ హర హర, లోటస్ కౌంటీ, సాయి కాలనీ, చంద్రా ఎన్‌క్లేవ్, రాజిరెడ్డి ఎన్‌క్లేవ్, మైత్రి సిటీ, నాకోలనీ, భగవాన్‌క్షాల్ నగర్, నీలగిరి ఎస్టేట్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.కీసర విద్యుత్ ఏఈ ఎస్. మురళీ కృష్ణ తెలియజేశారు.



# హ్యూమన్ వాషింగ్ మెషిన్.. 15 నిమిషాల్లో ఉతికారేస్తుంది!

ఇంట్లో మురికిపట్టిన దుస్తులను ఉతికారేసినట్లే మనుషులనూ శుభ్రం చేయొచ్చుగా.. ఇదే ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే మిరాయ్ హ్యూమన్ వాషింగ్ మెషిన్. జపాన్‌కు చెందిన ఓ కంపెనీ దీన్ని తయారుచేసింది. కేవలం 15 నిమిషాల్లో మనిషిని శుభ్రం చేయడం ఈ మెషిన్ ఉద్దేశం. వాస్తవానికి ఎలక్ట్రానిక్ ఎక్స్‌పోలో ప్రదర్శించేందుకు మాత్రమే దీన్ని రూపొందించారు. దీనికొచ్చిన ఆదరణ చూశాక విక్రయించాలన్న నిర్ణయానికొచ్చింది కంపెనీ.

జపాన్‌కు చెందిన సైన్స్ అనే సంస్థ దీన్ని ఆరేళ్ల పాటు కష్టపడి రూపొందించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో టోక్యోలో నిర్వహించిన ఒసాకా కాన్సాయ్ ఎక్స్‌పోలో దీన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా 40 వేలమంది దీన్ని ఓసారి ప్రయత్నించేందుకు దరఖాస్తు చేసుకున్నారట. దీంతో కమర్షియల్‌గా ఈ మెషిన్‌ను అందుబాటులోకి తేవాలని కంపెనీ నిర్ణయించింది.ఒక్కో వాషింగ్ మెషిన్ ధరను 60 మిలియన్ యెన్‌లుగా నిర్ణయించింది. అంటే మన కరెన్సీలో రూ.3కోట్ల పైమాటే! ఎప్పటి నుంచి విక్రయించేదీ మాత్రం వెల్లడించలేదు.

వాస్తవానికి హ్యూమన్ వాషింగ్ మెషిన్ తయారు చేయాలన్న ఆలోచన సాన్యో ఎలక్ట్రిక్‌ది. అంటే ఇప్పటి పానాసోనిక్ హోల్డింగ్స్‌ది. 1970లోనే ఒసాకా వరల్డ్ ఎక్స్‌పోలో ఓ ప్రొటోటైప్‌ను ప్రదర్శించింది. దీన్ని కమర్షియల్‌గా అందుబాటులోకి తేవడంలో విఫలమైంది. చిన్నతనంలో ఆ మెషిన్‌ను చూసిన సైన్స్ ప్రెసిడెంట్ అయోమా యసుకీకి.. భలే ముచ్చటగా అనిపించింది. ఆ ప్రేరణతో మిరాయ్ వాషింగ్ మెషిన్‌కు రూపకల్పన చేసినట్లు చెప్పారు.

1 మీటర్ వెడల్పు, 2.5 మీటర్ల లోతు, 2.6 మీటర్ల ఎత్తు ఉండే ఈ మెషిన్ చూడ్డానికి ఒక పాడ్ రూపంలో కనిపిస్తుంది. ఈ వాషింగ్ మెషిన్‌లోకి వెళితే మనిషి పూర్తి బాడీని శుభ్రం చేసి, డ్రై చేస్తుంది. మనిషి లోపలికి వెళ్లాక శరీరానికి ఉన్న మురికిని, మృత కణాలను తొలగిస్తుంది. స్కిన్ కండిషన్‌ని బట్టి క్లీనింగ్ సైకిల్‌ను మారుస్తుంది. క్లీనింగ్ సమయంలో హాయిగా రిలాక్స్ అయ్యేందుకు వీడియోలను, మ్యూజిక్‌ను ప్లే చేస్తుంది. మొత్తం 15 నిమిషాల వ్యవధిలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందని కంపెనీ చెబుతోంది. ఇందులో లోపలికి వెళ్లడం మినహా మానవ ప్రమేయం ఏమాత్రం ఉండదు. అయితే, వీటిని 4050కి మించి తయారు చేయకూడదని కంపెనీ నిర్ణయించుకుంది. బ్రాండ్ వాల్యూ కోసమే ఇలా చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి తెలిపారు. హోటళ్లు, స్పాలు వంటి కమర్షిల్ అవసరాలకు తప్ప గృహ వినియోగానికి వినియోగించబోమని స్పష్టం చేశారు.

# కేసీఆర్ ఉద్యమ పోరాటం తరతరాలకి స్ఫూర్తి

## మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో, నవంబర్ 28, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన దీక్ష దివస్ ఉద్యమం ఈ తరం మాత్రమే కాదు, రాబోయే తరాలు కూడా స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందని, ఉద్యమానికి కొత్త దిశ ఇచ్చిన మహోన్నత ఘట్టం దీక్ష దివస్ అని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు పేర్కొన్నారు. రాష్ట్ర సాధన ధ్యేయంతో ఆమరణ నిరాహార దీక్షకు దిగిన కేసిఆర్, "తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో" అంటూ నినాదంతో 29 నవంబర్ కేసీఆర్ చేపట్టిన దీక్ష దివస్, రాష్ట్ర ప్రజల కలల్ని నిజం చేసిన ప్రజా పోరాట దినంగా నిలిచిపోయిందన్నారు. దశాబ్దాలుగా అందని తెలంగాణ స్వప్నానికి కేసీఆర్ చూపిన అహింసాయుత పోరాట మార్గం తెలంగాణ రాష్ట్ర సాధన దిశగా అడుగులు వేసిందన్నారు. నిరాహార దీక్షతో కేసీఆర్ ప్రాణాలను పణంగా పెట్టి పోరాటాన్ని ముందుకు నడిపారనే విషయాన్ని ఆయన మరోసారి గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో రాత్రింబవళ్లు నాడు పోరాడిన తెలంగాణ విద్యార్థి లోకం, ఉద్యమకారులు, ఉద్యోగులు, అమరులు త్యాగాలు ఎన్నటికీ మరువలేమన్నారు. నేటి తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం, ప్రజల గౌరవ జీవనం అన్నీ ఉద్యమ ఫలితమేనని ఆయన అన్నారు. నేడు తెలంగాణను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని, గతంలో ఎలా పోరాడామో నేడు కూడా అదే స్ఫూర్తి కొనసాగాలని ఆయన పిలుపునిచ్చారు. దీక్ష దినోత్సవం సందర్భంగా ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త ఉద్యమ చరిత్రను గుర్తుచేసుకుని, ప్రజల మధ్యకు వెళ్లి దీక్ష ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. కేసీఆర్ స్ఫూర్తి, కేటీఆర్ నాయకత్వం, ఉద్యమ నాయకులు శ్రమ ఇవన్నీ కలిసి తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తాయని నామ విశ్వాసం వ్యక్తం చేశారు. 15వ లోక్‌సభలో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినపుడు తాను ఎంపీగా ఉండి తెలంగాణ బిడ్డగా ఆ బిల్లు పై తొలి ఓటు వేసానన్నారు. దీక్ష దివస్ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జరిగే కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఏమిటీ 'థర్డ్ వరల్డ్ కంట్రీస్'?.. భారత్ ఈ జాబితాలో ఉందా?

అమెరికా వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న అధ్యక్షుడు ట్రంప్ వారిపై మరో ఆయుధాన్ని ప్రయోగించారు. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను నిలిపివేసే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాదు వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ప్రయోజనాలనూ నిలిపివేస్తామన్నారు. అయితే, ఏయే దేశాల పౌరులపై ఈ చర్యలుంటాయో ఆయన ప్రస్తావించలేదు. ఈ నేపథ్యంలో అసలు థర్డ్ వరల్డ్ దేశాలంటే ఏవి? భారత్ పరిస్థితి ఏంటనే విషయాన్ని పరిశీలిస్తే.. 'థర్డ్ వరల్డ్ దేశాలు' అనే భావన ప్రచ్ఛన్న యుద్ధం కాలం నాటిది. ఎప్పటి నుంచి ఈ పదం వాడుకలో ఉందనే విషయంపై స్పష్టత లేనప్పటికీ.. ఫ్రెంచ్ జనాభా శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ శావీ 1952లో రాసిన "త్రీ వరల్డ్స్, వన్ ప్లానెట్" అనే ఆర్టికల్‌లో దీనిని వాడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అమెరికా, రష్యా మధ్య కోల్డ్ వార్ సమయంలో వాటికి మద్దతుగా నిలిచిన దేశాలను గుర్తించేందుకు ఫస్ట్, సెకండ్, థర్డ్ వరల్డ్ కంట్రీస్ అనే భావన మొదలైంది. అప్పట్లో వీటి అర్థం పేద, ధనిక దేశాలని కాదు. మొదటి ప్రపంచ దేశాల్లో



అమెరికా, నాటో మిత్రదేశాలు, పశ్చిమ యురోపియన్, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు ఉండేవి. కమ్యూనిస్టు సోవియట్ యూనియన్, తూర్పు యురోపియన్ మిత్రదేశాలు, క్యూబా, చైనా వంటివి రెండో ప్రపంచ దేశాలుగా ఉన్నాయి. ప్రచ్ఛన్న యుద్ధంలో తటస్థంగా ఉండి అలీన విధానాన్ని పాటించిన దేశాలను థర్డ్ వరల్డ్ కంట్రీస్‌గా పేర్కొనేవారు. ఇందులో ఎక్కువగా ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాకు చెందిన అభివృద్ధి చెందని దేశాలే ఉన్నాయి.

సోవియట్ యూనియన్ పతనం తర్వాత మూడో ప్రపంచం అనే పదం వాడుకలో లేకుండా పోయింది. ప్రస్తుతం దీనికి కచ్చితమైన నిర్వచనం లేదు. పేద, అభివృద్ధి చెందని దేశాలుగా అప్పట్లో పేర్కొన్నప్పటికీ.. ఇప్పుడు ఆ పదాలతో పిలవడం లేదు. ఆర్థికంగా వెనకబడిన దేశాలను తక్కువ అభివృద్ధి చెందిన దేశాలుగా ఐక్యరాజ్య సమితి వ్యవహరిస్తోంది. ప్రస్తుతం ఐరాస ఎల్‌డీసీ జాబితాలో 42 దేశాలు ఉండగా ఆఫ్రికాలో 32, ఆసియాలో ఎనిమిది (పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ తదితర దేశాలు), ఒక కరేబియన్ దేశం (హైతీ), పసిఫిక్‌లో మూడు దేశాలున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో అలీన విధానాన్ని పాటించిన భారత్ ఈ జాబితాలో ఉన్నప్పటికీ.. ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. దీంతో భారత్‌ను థర్డ్ వరల్డ్ కంట్రీగా పేర్కొనే అవకాశం లేదు. అమెరికా ఇమిగ్రేషన్ విభాగం ప్రకారం థర్డ్ వరల్డ్ కంట్రీస్‌కు ప్రత్యేకంగా ఎటువంటి నిర్వచనం లేదు. అయితే, ట్రంప్ ప్రకటనపై ఆయన యంత్రాంగం స్పందిస్తూ.. అఫ్గాన్ సహా 19 దేశాలకు చెందిన ప్రతి గ్రీన్ కార్డు దారుడి ఇమిగ్రేషన్ స్థితిని సమీక్షిస్తామని పేర్కొంది. జూన్‌లో అధ్యక్షుడు ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో పేర్కొన్న 'ఆందోళనకర దేశాలు' ఈ జాబితాలో ఉన్నాయని ఇమిగ్రేషన్ సర్వీసెస్ డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# 'బంగారం ధరలు నిర్ణయించే స్థాయికి భారత్'

దిల్లీ: ప్రపంచంలో అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ ఒకటి. పెద్ద మొత్తంలో బంగారం మన దేశంలో ఉన్నా.. దీని ధర నిర్ణయించే అధికారం మాత్రం లేదు. భవిష్యత్తులో మాత్రం ప్రపంచ గోల్డ్ మార్కెట్‌లో ధరలు నిర్ణయించే దేశంగా భారత్ ఎదగనుందని, ఇందుకు సొంత గనుల నుంచి వచ్చే బంగారం కీలక భూమిక పోషిస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే దశాబ్ద కాలంలో దేశ బంగారు అవసరాలను సుమారు 20 శాతం సొంత గనులే తీర్చనున్నాయని అభిప్రాయపడ్డాయి. ఈ మేరకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జెమ్స్ అండ్ జ్యువెలరీ కాన్ఫరెన్స్‌లో పలువురు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో గోల్డ్ మైనింగ్ కీలక భూమిక పోషించబోతోందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఇండియా రీజనల్ సీఈఓ సచిన్ జైన్ అన్నారు. దేశీయంగా గనుల తవ్వకం వల్ల ఇండియన్ గోల్డ్‌కు ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు,




ఈ రంగంలో విదేశీ పెట్టుబడులు కూడా వస్తాయని చెప్పారు. దేశంలో గణనీయమైన బంగారు గనులు లేకపోవడం, గోల్డ్ బ్యాంకింగ్ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రైస్ టేకర్‌గా ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం లండన్ ఏఎం, పీఎం బెంచ్‌మార్క్ ధరలను అనుసరిస్తున్నామని చెప్పారు. ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థలో వస్తున్న మార్పులతో రానున్న రోజుల్లో మనమే ధరలు నిర్ణయించే స్థాయికి చేరుకుంటామని సచిన్ జైన్ ధీమా వ్యక్తంచేశారు. వచ్చే రెండు మూడేళ్లలో భారత్ ప్రపంచ జ్యువెలరీ హబ్‌గా ఎదగనుందని అభిప్రాయపడ్డారు. భారతీయుల దగ్గర సుమారు 25 వేల టన్నుల బంగారం ఉందని ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన నోవల్ జువెల్స్ సీఈఓ సందీప్ కోహ్లీ అన్నారు. ప్రభుత్వం వద్ద 800 టన్నుల బంగారం ఉందన్నారు. అదే స్విట్జర్లాండ్ ప్రభుత్వం వద్ద వెయ్యి టన్నులుంటే.. ప్రజల వద్ద 200 టన్నులు మాత్రమే ఉందన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుగా ఉన్న భారత్.. బంగారం ధరలను నిర్ణయించే స్థితిలో లేకపోవడం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని కోహ్లీ అన్నారు. అయితే ఖరీదైన కారు, స్మార్ట్‌ఫోన్ కొనుగోలు విషయంలో లేని ఆందోళన.. బంగారం విషయంలో మాత్రం ఉంటోందన్నారు. ఆన్‌లైన్‌లో పోల్చుకునే సౌలభ్యం లేకపోవడమే కారణమని చెప్పారు. బంగారం ధరలు నిర్ణయించడంలో ప్రపంచ స్థాయికి ఎదగాలంటే సోర్సింగ్, మార్కెటింగ్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత అవసరమని ఎంఎంటీసీ పీఏఎంపీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సమిత్ గుహ అన్నారు. బీఐఎస్ అందిస్తున్న హాల్‌మార్కింగ్‌ను కొనియాడుతూనే మరింత మెరుగైన విధానాలు అవసరమని అభిప్రాయపడ్డారు. 201213 ఆర్‌బీఐ విధించిన నిబంధన వల్ల 24 క్యారెట్ బులియన్ ఎగుమతిపై నిషేధం ఎదుర్కొంటున్నామని చెప్పారు. గ్లోబల్ ఎక్స్ఛేంజీలో భారతీయ బులియన్ సరఫరా చేయాలంటే ఈ నిబంధనపై ఒకసారి పునరాలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ఇంటి వద్దే ఆధార్ మొబైల్ నంబర్ అప్‌డేషన్.. త్వరలో కొత్త సదుపాయం

భారత విశిష్ఠ గుర్తింపు ప్రాధికార సంస్థ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమవుతోంది. ఆధార్ కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండానే ఇంటి వద్దే మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసే సౌకర్యాన్ని తీసుకొస్తోంది. త్వరలోనే ఈ సదుపాయం అందుబాటులోకి తేనున్నట్లు ఉడాయ్ తన ఎక్స్ వేదికగా వెల్లడించింది.

ఆధార్ మొబైల్ నంబర్ అప్‌డేషన్‌కు ప్రస్తుతం వ్యక్తిగతంగా ఆధార్ కేంద్రానికి వెళ్లాల్సిందే. చిన్న పనే అయినా ఆధార్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో నిల్చోవాల్సిందే. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి చెక్ పెడుతూ ఉడాయ్ తన ఆధార్ యాప్‌లో కొత్త సదుపాయం తీసుకొస్తోంది. ఓటీపీ, ఆధార్ ఫేస్ అథంటికేషన్ కలిపి ఒక కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేస్తోంది. మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్ చేసి, ఆ తర్వాత కెమెరా ద్వారా ముఖాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుంది. తద్వారా మొబైల్ అప్‌డేషన్‌ను సులువుగా పూర్తి చేయొచ్చు. త్వరలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రానుందని ఉడాయ్ తెలిపింది. ఇందుకోసం ఇటీవల తీసుకొచ్చిన కొత్త ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఈ ఫీచర్ అందుబాటులోకి వచ్చిన వారు ఫీడ్‌బ్యాక్‌ను తమతో పంచుకోవాలని కోరింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# బ్లడ్ షుగర్ లెవెల్స్‌కు చెక్ పెట్టాలా?

మీ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలని చూస్తున్నారా? అయితే ఉదయాన్నే పరగడుపున మీరు తీసుకునే కొన్ని ఆహారాలు మీ బ్లడ్ షుగర్ గేమ్‌ను రోజు మొత్తం మార్చేస్తాయి. ప్రముఖ పోషకాహార నిపుణులు సూచించిన ఐదు ఆహార పదార్థాలను మీ దినచర్యలో భాగం చేసుకోండి. ఇవి ఇన్సులిన్ నిరోధకతను తగ్గించి, మీ రక్తంలో చక్కెర స్థాయిలను సహజంగా స్థిరీకరించడానికి సహాయపడతాయి. ఆధునిక జీవనశైలిలో చాలామందిని వేధిస్తున్న సమస్య రక్తంలో చక్కెర స్థాయిల హెచ్చుతగ్గులు. దీనిని నియంత్రించడంలో ఉదయం పూట మనం తీసుకునే ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రముఖ పోషకాహార నిపుణుడు రజత్ జైన్, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించేందుకు ఉదయాన్నే పరగడుపున తీసుకోవాల్సిన ఐదు అద్భుతమైన ఆహార పదార్థాల గురించి వివరించారు. ఈ ఆహారాలు ఇన్సులిన్ నిరోధకతను తగ్గించి, రోజు మొత్తం రక్తంలో చక్కెరను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. 1. నానబెట్టిన బాదం: పావు కప్పు నీటిలో నానబెట్టిన 3-5 బాదం పప్పులను పరగడుపున తీసుకోవడం చాలా ప్రయోజనకరం. బాదంలో ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా అడ్డుకుంటాయి. 2. ఉసిరి రసం: ఒక మీడియం సైజు ఉసిరిని పావు కప్పు నీటిలో కలిపి తీసుకోవడం వల్ల ప్యాంక్రియాస్ పనితీరు బలపడుతుంది. ఉసిరిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, క్రోమియం రక్తంలో చక్కెరను సహజంగా స్థిరీకరించడంలో సహాయపడతాయి.3. దాల్చినచెక్క నీరు: ఒక కప్పు నీటిలో చిన్న దాల్చినచెక్క ముక్కను వేసి తాగడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది. ఇది ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. శరీరంలో ఉండే వాపును కూడా తగ్గిస్తుంది.4. మొలకెత్తిన పెసలు: అరకప్పు మొలకెత్తిన పెసలలో మీకు నచ్చిన తరిగిన కూరగాయలు కలిపి తీసుకోవచ్చు. ఇది ప్యాంక్రియాస్ పనితీరును బలపరుస్తుంది. రక్తంలో చక్కెరను సహజంగా స్థిరీకరించడంలో సహాయపడుతుంది. పెసలలో ఫైబర్, ప్రొటీన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.5. మెంతి టీ: ఒక కప్పు వేడి నీటిలో ఒక టీస్పూన్ మెంతి గింజలు వేసి తయారుచేసిన టీని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది.

# గర్భనిరోధక మాత్రలు నిజంగా సేఫేనా..?



మహిళలందరూ గర్భనిరోధక మాత్రలు వాడటం సౌకర్యంగా భావిస్తారు. ఇవి గర్భధారణను నియంత్రించడం కోసం ఎంతో కాలంగా ఉపయోగిస్తున్న పద్ధతులు. అయితే ఇలాంటి మాత్రలు వాడినప్పుడు కొంతమందికి ప్రమాదాలు ఉండవచ్చని కొత్త అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఈ మందులు కొన్ని రకాల గుండె సంబంధిత సమస్యలతోపాటు పక్షవాతం అనే తీవ్రమైన ప్రమాదాన్ని కూడా పెంచవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. గర్భనిరోధక మందుల వాడకానికి ముందు వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ మధ్యకాలంలో 18 నుంచి 49 ఏళ్ల మధ్య యువతుల్లో కనిపించే క్రిప్టోజెనిక్ స్ట్రోక్ (ఏ కారణం లేకుండా మెదడులో రక్త ప్రవాహం ఆగిపోవడం)పై పరిశోధనలు జరిగాయి. వీటిలో హార్మోన్ మాత్రలు వాడే మహిళల్లో ఈ ప్రమాదం మూడు రెట్లు ఎక్కువగా ఉండటం గుర్తించారు. అంతేకాకుండా ఇతర ఆరోగ్యపరమైన ప్రమాదకారక అంశాలు ఉన్నా కూడా స్ట్రోక్ వచ్చే అవకాశంలో గణనీయమైన తగ్గుదల కనిపించలేదని పరిశోధకులు పేర్కొన్నారు. నిపుణుల వివరణ ప్రకారం.. హార్మోన్ మాత్రల్లో ఉండే ఈస్ట్రోజెన్ అనే పదార్థం రక్తం గడ్డ కట్టే ప్రభావాన్ని పెంచుతుందని తెలియజేశారు. సాధారణంగా రక్తంలో గడ్డకట్టే ప్రక్రియ సహజమే అయినప్పటికీ.. ఈస్ట్రోజెన్ ఎక్కువ మోతాదులో ఉంటే ఇది ప్రమాదకరం అవుతుంది. గడ్డ కట్టడం వల్ల మెదడుకు రక్తం సరఫరా తగ్గి పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువవుతుంది. ఇంకొక ముఖ్యమైన అంశం ఏమిటంటే.. పొగ తాగడం, అధిక బరువు, మైగ్రేన్ లాంటి పరిస్థితులు ఉంటే ఈ ప్రమాదం మరింత పెరుగుతుంది. ప్రత్యేకించి ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ కలిపిన హార్మోన్ మాత్రల్లో ఉండే కృత్రిమ ఈస్ట్రోజెన్ వల్ల ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వజైనల్ రింగ్, ప్యాచ్ లాంటి ఇతర హార్మోన్ల పద్ధతుల వాడకం కూడా పక్షవాతం ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉంది. అయితే ఇది చాలా అరుదైన ప్రమాదం మాత్రమే. 4,700 మందిలో ఒక్కరికి మాత్రమే ఇది సంభవించవచ్చు. కానీ ఈ మాత్రలు వాడే మహిళల సంఖ్య భారీగా ఉండటం వల్ల.. మొత్తం మీద ఈ ప్రమాదం అందరికీ పెద్ద సమస్యగా మారుతుంది.అయితే ఈ ప్రమాదాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

గర్భనిరోధక మందులు వాడటం వల్ల కలిగే ప్రమాదాలతో పాటు, గర్భధారణ సమయంలో కూడా రక్తం గడ్డ కట్టే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుందని కూడా తెలుసుకోవాలి. అందువల్ల తల్లి బిడ్డ ఆరోగ్య ప్రయోజనాలను అన్నింటినీ పరిగణించి జాగ్రత్తగా ఎంచుకోవడం అవసరం. ఈ అంశంపై మరింత పరిశోధనలు జరపాల్సిన అవసరం ఉంది. మహిళలు తమ శరీరానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పూర్తి సమాచారం కలిగి ఉండటం చాలా అవసరం. ఈ మాత్రలు వాడటం వల్ల కొంతమేర రక్తం గడ్డకట్టే ప్రమాదం పెరుగుతుందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి.



# ఏబీసీ జ్యూస్ రోజూ తాగితే ఏమవుతుందో తెలుసా..?

మంచి ఆరోగ్యం కోసం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. మీరు తినే వాటి ప్రభావం నేరుగా మీ ఆరోగ్యంపై ఉంటుంది. అందుకే ఆరోగ్య నిపుణులు అందరూ శరీరానికి కావాల్సిన పోషకాలను ఆహారం ద్వారానే తీసుకోవాలని చెబుతారు. మంచి ఆరోగ్యం కోసం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. మీరు తినే వాటి ప్రభావం నేరుగా మీ ఆరోగ్యంపై ఉంటుంది. అందుకే ఆరోగ్య నిపుణులు అందరూ శరీరానికి కావాల్సిన పోషకాలను ఆహారం ద్వారానే తీసుకోవాలని చెబుతారు. మీకు మంచి ఆరోగ్యం కావాలంటే కొన్ని రకాల జ్యూస్‌లను మీ ఆహారంలో చేర్చుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. పండ్లు, కూరగాయల జ్యూస్‌లలో పోషకాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చాలా రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి మిమ్మల్ని కాపాడతాయి. ఫ్రూట్ జ్యూస్ లు అందరూ తాగుతారు. కానీ.. వాటికంటే ఏబీసీ జ్యూస్ మరింత మంచిది. ప్రతి ఒక్కరూ రోజూ ఏబీసీ జ్యూస్ తాగాలని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ జ్యూస్‌లో శరీరానికి కావాల్సిన చాలా పోషకాలు ఉంటాయి. ఏబీసీ జ్యూస్ ఆరోగ్యానికి చాలా మంచిదిగా చెబుతారు. ఏబీసీ అంటే ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్. ఆపిల్, బీట్‌రూట్, క్యారెట్ జ్యూస్ మిశ్రమం మీ ఆరోగ్యానికి అవసరమైన చాలా పోషకాలను అందిస్తుంది. మీరు 100 ఎశ్రీ ఏబీసీ జ్యూస్ తాగితే 4550 కేలరీలు, 1012 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 89 గ్రాముల చక్కెర, 0.5 గ్రాముల ప్రోటీన్, ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు అందుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ జ్యూస్ శరీరాన్ని శుభ్రపరచడానికి, జీర్ణక్రియ, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది.

ఏబీసీ జ్యూస్ తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. హిమోగ్లోబిన్ స్థాయిలు మెరుగుపడతాయి. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉదయం ఖాళీ కడుపుతో ఈ జ్యూస్ తాగితే శరీరం శుభ్రపడుతుంది (టాక్సిన్స్ తొలగిపోతాయి). బరువు తగ్గాలనుకునే వారికి ఏబీసీ జ్యూస్ చాలా ఉపయోగపడుతుంది. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. క్యారెట్‌లో ఉండే పొటాషియం, ఫైబర్ కడుపు నిండినట్లు ఉంచుతాయి. ఏబీసీ జ్యూస్ తాగడం వల్ల చర్మం మెరుస్తుంది. జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. ఈ జ్యూస్‌లో ఉండే విటమిన్లు, ఖనిజాలు చర్మం సాగే గుణాన్ని తగ్గిస్తాయి. ముఖంపై వచ్చే వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మీ గట్ ఆరోగ్యాన్ని కాపాడటానికి కూడా ఉపయోగపడుతుంది. ఇది జీవక్రియను పెంచడానికి, ప్రేగు కదలికలను క్రమబద్ధీకరించడానికి, మలబద్ధకం తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే క్యారెట్లు మీ కళ్ళను ఆరోగ్యంగా ఉంచుతాయి. అయితే, ఈ జ్యూస్ తాగడం వల్ల చాలా లాభాలు ఉన్నప్పటికీ, కొంతమందికి ఇది హానికరం కావచ్చు. ఈ జ్యూస్‌ను ఎక్కువగా తాగడం వల్ల కొంతమందికి గ్యాస్, ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. డయాబెటిస్ ఉన్నవారు కూడా ఈ జ్యూస్ తాగే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇది చక్కెర స్థాయిలను పెంచే ప్రమాదం ఉంది. మీకు రక్తపోటు సమస్యలు ఉంటే కూడా వీలైనంత తక్కువగా తీసుకోండి. బీట్‌రూట్ మీ రక్తపోటును మరింత తగ్గిస్తుంది. డైటీషియన్ సలహా మేరకు ఈ జ్యూస్ తాగడం మీకు మంచిది.

# మామిడి పండ్లు మిస్ చేసుకోకండి..!

మామిడి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. చర్మ కణాలు దెబ్బతినకుండా నివారిస్తుంది. మామిడి పండ్లలో ఉండే ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయ పడుతుంది. ఇన్ని లాభాలు ఉన్నప్పటికీ మామిడి పండ్లను ఎల్లప్పుడూ మితంగా తినటం మంచిది అంటున్నారు నిపుణులు. వేసవి అంటేనే మామిడి పండ్లకు సీజన్.. నోరూరించే మామిడి పండ్ల కోసం ఏడాది అంతా ఎదురు చూస్తుంటారు చాలా మంది. అందుకే మామిడి పండును పండ్లలో రారాజుగా పిలుస్తారు. మామిడి పండ్లు రుచికరంగా ఉండటమే కాకుండా శరీరానికి కూడా అనేక ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. మామిడి పండ్ల వల్ల బోలెడన్నీ లాభాలు, ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మామిడి పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది ఉబ్బరం, మలబద్ధకం, అజీర్ణం వంటి జీర్ణ రుగ్మతల నుండి ఉపశమనం కలిగిస్తుంది. మామిడి పండ్లలో ఉండే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి. మామిడి పండ్లలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడానికి, ఆరోగ్యకరమైన హృదయనాళ వ్యవస్థకు తోడ్పడతాయి. మామిడి పండ్లలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది మంచి దృష్టికి అవసరం. వయస్సు సంబంధిత కంటి వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. మామిడి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. చర్మ కణాలు దెబ్బతినకుండా నివారిస్తుంది. మామిడి పండ్లలో ఉండే ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయ పడుతుంది. ఇన్ని లాభాలు ఉన్నప్పటికీ మామిడి పండ్లను ఎల్లప్పుడూ మితంగా తినటం మంచిది అంటున్నారు నిపుణులు.




# నిమ్మతొక్కలో ఏముందిలే అనుకుంటున్నారా..?



చాలా మంది నిమ్మతొక్కలను బయటపడేస్తూ ఉంటారు. కానీ, నిమ్మ తొక్కలు కూడా అద్భుతమై ప్రయోజనాలు అందిస్తాయని మీకు తెలుసా..? వాటి వల్ల ఉపయోగాలు, ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు. అవును, నిమ్మకాయతోనే కాదు వాటి తొక్కల వల్ల కూడా బోలెడన్నీ ఉపయోగాలుంటాయి. ఒక రకంగానే కాదు అనేక రకాలుగా వీటిని ఉపయోగించుకోవచ్చు. నిమ్మ తొక్కలు కూడా అద్భుతమై ప్రయోజనాలు అందిస్తాయి. ముఖ్యంగా నిమ్మకాయ తొక్క పోషక లక్షణాలతో నిండి ఉంటుంది. నిమ్మ తొక్కలు విటమిన్ సితో నిండి ఉంటాయి. ఇది రోగ నిరోధక శక్తిని పెంచటంలో సహాయపడుతుంది. సాధారణ వ్యాధులతో పోరాడటానికి మన రోగనిరోధక శక్తిని బలపరిచేందుకు విటమిన్ సీ ఉపయోగపడుతుంది. నిమ్మ తొక్కలలో ఉండే బయోఫ్లావనాయిడ్స్ ఎముకల ఆరోగ్యానికి, ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఉపయోగపడతాయి. నిమ్మ తొక్కలు యాంటీ బాక్టీరియల్ భాగాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. గుండె ఆరోగ్యాన్ని నిర్వహించడానికి, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడే ఫ్లేవనాయిడ్‌లతో నిండి ఉన్నాయి. నిమ్మ తొక్కలలోని ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది, గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అలాగే ఈ ప్రక్రియలో బరువు తగ్గడాన్ని సులభతరం చేస్తుంది. నిమ్మ తొక్కలలో ఉండే బయోఫ్లావనాయిడ్స్ ఎముకల ఆరోగ్యానికి, ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఉపయోగపడతాయి. నిమ్మ తొక్కలు యాంటీ బాక్టీరియల్ భాగాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. నిమ్మ తొక్కను ఎండబెట్టి పొడిచేసి తీసుకుంటే అనేక పోషకాలను లభిస్తాయి. ఇందులో ఉండే పొటాషియం హైబీపీని తగ్గిస్తుంది. నిమ్మ తొక్క పొడి రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది. గుండె జబ్బులను నివారిస్తుంది. అంతేకాదు.. నిమ్మ తొక్క పొడిలో క్యాన్సర్ కణాలను నాశనం చేసే గుణాలున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. నిమ్మ తొక్కలను జుట్టు సంరక్షణకు కూడా ఉపయోగించవచ్చు. వీటిని పేస్ట్ లాగా తయారు చేసి వాడుకోవచ్చు. నిమ్మ తొక్కలను నూనెలో వేడి చేసిన తర్వాత చల్లార్చాలి. ఈ నీటిని జుట్టుకు పట్టించటం వల్ల తలలో చుండ్రు సమస్య తగ్గుతుంది. స్నానం చేసేటప్పుడు నిమ్మ తొక్కతో శరీరాన్ని రుద్దితే క్రిములు తొలగిపోతాయి.

# మహిళలు ఖర్జూరాలు ఎందుకు తినాలి?

అందుకే మహిళలు గర్భధారణ సమయంలో ఖర్జూరాలు తినేటప్పుడు అవి గొప్ప పోషక మద్దతును అందిస్తాయి. మీకు డయాబెటిస్ ఉంటే, ఖర్జూరాలను తీసుకునేటప్పుడు మీరు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇందులో చక్కెర అధికంగా ఉంటుంది. వీటి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఖర్జూరాలు ఫోలేట్ చాలా మంచి మూలంగా పరిగణిస్తారు. ఇది అందరికీ అవసరమైనదిగా ఉంటుంది. కానీ గర్భిణీ స్త్రీలకు ఇది చాలా ముఖ్యమైనది. గర్భధారణ సమయంలో మహిళలు తరచుగా ఫోలేట్ సప్లిమెంట్లను తీసుకోవాలని సలహా ఇస్తారు వైద్యులు. అందుకే మహిళలు గర్భధారణ సమయంలో ఖర్జూరాలు తినేటప్పుడు అవి గొప్ప పోషక మద్దతును అందిస్తాయి. మీకు డయాబెటిస్ ఉంటే, ఖర్జూరాలను తీసుకునేటప్పుడు మీరు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇందులో చక్కెర అధికంగా ఉంటుంది. వీటి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఫైబర్,



పోటాషియం.. మరెన్నో..: ఖర్జూరాలు ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, ఫోలేట్, విటమిన్ కె, విటమిన్ బి 6 వంటి ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఈ పోషకాలు శిశువు ఆరోగ్యకరమైన అభివృద్ధికి, తల్లి ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. సహజ శక్తికి మూలం: ఖర్జూరాలు కార్బోహైడ్రేట్ల సహజ మూలం. ఇవి గర్భధారణ సమయంలో తక్షణ శక్తిని అందించగలవు, అలసటతో పోరాడగలవు. మిమ్మల్ని చురుకుగా ఉంచుతాయి. అవి జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి: ఖర్జూరాలలో అధిక ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఇది గర్భధారణ సమయంలో సాధారణ సమస్య. ఫైబర్ క్రమం తప్పకుండా ప్రేగు కదలికలను ప్రోత్సహించడానికి, జీర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం.. గర్భం చివరి దశలలో ముఖ్యంగా చివరి కొన్ని వారాలలో ఖర్జూరాలు తినడం వల్ల గర్భాశయ విస్తరణను ప్రోత్సహిస్తుంది. ఖర్జూరాలు రక్తపోటు నియంత్రణ: ఖర్జూరాలలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటు స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. రక్తపోటులో హెచ్చుతగ్గులను అనుభవించే గర్భిణీ స్త్రీలకు ఇది ప్రయోజనకరంగా ఉండవచ్చు. పుష్కలంగా ఐరన్: గర్భధారణ సమయంలో ఐరన్ లోపం ఒక సాధారణ ఆందోళన. ఖర్జూరాలు ఇనుముకు మంచి మూలం. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి, రక్తహీనతను నివారించడానికి అవసరం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ప్రధాని మోదీ ఉడుపి, గోవాలో భక్తి, భద్రతా సందేశాలు



ఉగ్రదాడులు జరిగినప్పుడు గత ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీ ఆరోపించారు. అయితే ప్రస్తుత నవ భారతం తన ప్రజలను రక్షించుకోవడంలో వెనకడుగు వేయదని, ఎవరికీ తల వంచదని స్పష్టం చేశారు. కర్ణాటకలో ఒకరోజు పర్యటనలో భాగంగా ఆయన ఉడుపికి వచ్చారు. పర్యాయ పుత్తిగె మఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామీజీ మోదీకి ఘన స్వాగతం పలికారు. కనకన కిండి (కనకదాసు కిటికీ) ద్వారా శ్రీకృష్ణుడి మూల విరాట్‌ను ప్రధాని దర్శించుకున్నారు. కనకదాసుకు పుష్పార్చన చేసి, కనకనకిండికి ఏర్పాటు చేసిన బంగారు కవచాన్ని, సువర్ణ తీర్థ మండపాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత శ్రీకృష్ణమఠం నిర్వహించిన లక్ష కంఠ భగవద్గీతా పఠనంలో పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. అయోధ్య రామజన్మభూమి పోరాటంలో ఉడుపి మఠం కీలక పాత్ర పోషించిందని, ఈ విషయం దేశానికి తెలుసన్నారు.

పెజావర మఠాధిపతి విశ్వేశతీర్థ స్వామీజీ మార్గదర్శకంలోనే అయోధ్య రామమందిరంలో ధ్వజారోహణ జరిగిందని మోదీ గుర్తుచేశారు. రామమందిరంలో ఉడుపి మధ్వాచార్యులకు కేటాయించిన ప్రత్యేక ద్వారం ఉందని తెలిపారు. శాంతి, సత్యాన్ని పునఃస్థాపించడంతో పాటు దౌర్జన్యాన్ని అంతం చేయాలని భగవద్గీత మనకు నేర్పుతుందని, ఇదే మన జాతీయ భద్రతా విధానం సారాంశమని అన్నారు. ఎర్రకోట నుంచి శ్రీకృష్ణుడి కరుణ సందేశాన్ని వినిపించామని, ఆయన స్ఫూర్తితో 'మిషన్ సుదర్శన చక్ర'ను ప్రకటించామని తెలిపారు. దేశంలోని ప్రముఖ స్థలాలు, పారిశ్రామిక ప్రాంతాలు, జనం చేరే ప్రదేశాల



చుట్టూ రక్షణ కవచాన్ని రూపొందించామని చెప్పారు. దీన్ని శత్రువులు ఛేదించలేరన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే దిశగా నీటి సంరక్షణ, మొక్కలు నాటడం, పరిశుభ్రత, స్వదేశీ, దేశ్ దర్శన్, ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యకరమైన జీవనశైలి, యోగా మరియు క్రీడలు, పేదలకు సహాయం చేయడం అనే తొమ్మిది సంకల్పాలు చేయాలని ప్రజలను మోదీ కోరారు.


లక్ష కంఠ గీతా పారాయణలో భాగంగా భగవద్గీత 15వ అధ్యాయంలోని పలు శ్లోకాలను ప్రధాని పఠించారు. ఇదే వేదికపై శ్రీకృష్ణ మఠం మోదీని 'భారత భాగ్య విధాత' బిరుదుతో సత్కరించింది. మజ్జిగ చిలికే వెండి కవ్వాన్ని మఠాధిపతి ప్రధానికి బహూకరించారు. 2008లో గుజరాత్ సీఎం హోదాలో తొలిసారి ఉడుపికి వచ్చిన



మోదీ, ప్రస్తుతం ప్రధాని హోదాలో వచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు.

శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ మఠం 550వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోవాలో 77అడుగుల ఎత్తయిన శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించారు. దక్షిణ గోవాలోని పర్తగలి మఠంలో ఉన్న ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగిస్తూ.. ప్రజల్లో ఐక్యత ద్వారానే వికసిత్ భారత్ సాధ్యమని అన్నారు. నేడు భారత్ సాంస్కృతిక పునరుజ్జీవన దశలో ఉందన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం, కాశీ విశ్వనాథ్ ధామ్ పునరుద్ధరణ, ఉజ్జయినిలో మహాకాళ్ మహాలోక్ విస్తరణ వంటివన్నీ అందుకు ఉదాహరణలుగా పేర్కొన్నారు. కాగా, ఇది ప్రపంచంలోనే ఎత్తయిన రాముడి విగ్రహమని గోవా మంత్రి దిగంబర్ కామత్ తెలిపారు.

# 4న భారత్‌కు పుతిన్



సుదీర్ఘకాలం నుంచి మిత్రదేశాలుగా ఉన్న భారత్, రష్యా సంబంధాలు నూతన శిఖరాలకు చేరనున్నాయి. వచ్చే నెల 4, 5 తేదీల్లో భారత్‌లో పుతిన్ పర్యటించనున్న నేపథ్యంలో రక్షణ, దౌత్యపరమైన బంధాలతోపాటు పలు ఇతర అంశాల్లో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది. భారత్‌లో పుతిన్ పర్యటన వివరాలను విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటించింది. "ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు రష్యా అధ్యక్షుడు పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటిస్తారు. 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు" అని వెల్లడించింది. పుతిన్‌కు గౌరవార్థం రాష్ట్రపతి విందు ఇవ్వనున్నట్టు తెలిపింది. భారత్‌పై అమెరికా అడ్డగోలు టారిఫ్‌లు, రష్యాపై ఆంక్షలు, రష్యా చమురు కొనుగోలు చేయవద్దన్న ఒత్తిడుల నేపథ్యంలో.. పుతిన్ భారత పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్‌కు మరిన్ని ఎస్400 క్షిపణి రక్షక వ్యవస్థలు, రెండు స్క్వాడ్రన్ల ఎస్‌యూ57 ఫైటర్ల సరఫరా, ఇరు దేశాల మధ్య స్థానిక కరెన్సీలో లావాదేవీలు, పౌరఅణుశక్తి రంగంలో మరింత సహకారం, రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుకు సంబంధించి కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది.

# బిహార్ ఓటమిపై రాహుల్‌గాంధీ స్వీకరణ: స్థానిక నేతలతో సమాన బాధ్యత



బిహార్‌లో కాంగ్రెస్ ఓటమికి స్థానిక నాయకులతో సమానంగా తాను కూడా బాధ్యుడినేనని ఆ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నట్టు సమాచారం. బిహార్ ఎన్నికల కోసం పనిచేసిన నాయకులు, పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులతో కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం అంతర్గత సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగానే రాహుల్ పై వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఈసీ చేపట్టిన 'సర్' ప్రక్రియ వల్లే బిహార్‌లో ఓడిపోయామని నేతలు తేల్చినట్టు తెలిసింది. ఓటమినే తలుచుకుని బాధపడకుండా, ఇతర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించాలని రాహుల్ ఈ సమావేశంలో నేతలకు హితబోధ చేసినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. "వ్యవస్థాగత బలహీనతలే కాంగ్రెస్‌ను దెబ్బతీశాయనే వాదనను రాహుల్ సమావేశంలో అంగీకరించలేదు. అదే నిజమైతే గట్టి పార్టీ నిర్మాణాలు కలిగిన ఆర్జేడీ, వామపక్షాలు ఎందుకు ప్రభావం చూపలేకపోయాయని ఆయన ప్రశ్నించారు. ఏఏ అంశాలు బిహార్‌లో పార్టీని దెబ్బతీశాయనేది నిర్దిష్టంగా గుర్తించాలని, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలని ఆయన దిశానిర్దేశం చేశారు" అని ఓ నేత తెలిపారు. కాగా, ప్రాణాంతకంగా మారిన ఢిల్లీ వాయు కాలుష్య సమస్యపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరపాలని కేంద్రాన్ని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.


# శబరిమల యాత్రకు ఇరుముడిని నేరుగా విమానంలో తీసుకెళ్లేందుకు అనుమతి

విమానంలో శబరిమల వెళ్లాలనుకుంటున్న అయ్యప్ప స్వామి భక్తులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు శుభవార్త చెప్పారు. అయ్యప్ప స్వాములు అత్యంత పవిత్రంగా భావించే ఇరుముడిని (కొబ్బరికాయతో సహా) తమతోపాటే నేరుగా విమానంలో తీసుకెళ్లేందుకు (క్యాబిన్ బ్యాగేజీ కింద) అనుమతిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రత్యేక సడలింపు జనవరి 20 వరకు దేశవ్యాప్తంగా వర్తిస్తుందని తెలిపారు. ఎయిర్ పోర్టు భద్రతా సిబ్బందికి అయ్యప్ప భక్తులు సహకరించాలని, ఇరుముడి స్క్రీనింగ్, తనిఖీల సందర్భంలో అధికారుల సూచనలను అనుసరించాలని సూచించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న భద్రతా నియమావళి ప్రకారం ఇరుముడిని చెక్‌ఇన్ లగేజీగా మాత్రమే విమానాల్లో అనుమతిస్తున్నారు. దీనిపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో భక్తుల విశ్వాసాలను పరిగణనలోకి తీసుకున్న పౌర విమానయాన శాఖ.. ఇరుముడిని చేతబట్టుకునే విమానంలో ప్రయాణించే వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం ఓ వీడియోను విడుదల చేశారు. "శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తుల భావోద్వేగాలను గౌరవిస్తూ.. ఇరుముడిని తమతోపాటు నేరుగా విమానంలో తీసుకెళ్లేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నా. అవసరమైన అన్ని భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేస్తూనే భక్తుల సంప్రదాయలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాం" అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.





# దేశ భద్రతలో భారీ పురోగతి: అమిత్ షా



నక్సలిజంతోపాటు ఈశాన్యరాష్ట్రాల్లో వేర్పాటువాదం, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద సమస్యలను ప్రధాని మోదీ శాశ్వతంగా పరిష్కరించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో మూడ్రోజులపాటు జరిగే డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ పోలీస్/ ఇన్‌స్పెక్టర్స్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ/ఐజీపీ)ల వార్షిక సదస్సులో శుక్రవారం అమిత్ షా పాల్గొని ప్రసంగించారు.

"మాదక ద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాల ముఠాలపై అన్ని వైపుల నుంచి పోలీసులు ముప్పేట దాడులు చేయాలి. మత్తుపదార్థాల అక్రమరవాణా ముఠాలు, నేరగాళ్లకు దేశంలో నిలువనీడలేకుండా చేయాలి. లక్ష్యంపై సాటిలేని గురి, నిఘా, సమర్థవంతమైన ప్రణాళికతో భద్రతా బలగాలు, పోలీసులు దేశంలోని అతివాదం, వేర్పాటువాదం, మత్తు మహమ్మారిల అంతుచూస్తున్నారని అమిత్ షా కొనియాడారు.

నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోతో ఇక అన్ని రాష్ట్రాల పోలీస్‌విభాగాలు కలిసి పనిచేస్తూ రాష్ట్ర,దేశ, అంతర్జాతీయ స్థాయిలో చీకటి వ్యాపారంచేస్తున్న డ్రగ్స్ ముఠాల సూత్రాధారులను బంధించి చట్టం ముందు నిలబెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. పాపులర్ ఫ్రంట్ ఆఫ్‌ఇండియా వంటి నిషేధిత సంస్థను కూకటివేళ్లతో పెకలించి రాష్ట్ర, కేంద్ర బలగాలు తమ సమిష్టకృషిని అద్భుతంగా చాటాయి.

40 ఏళ్లుగా పట్టిపీడిస్తున్న నక్సలైట్ల దాడి బెడదను తగ్గించేందుకు దేశవ్యాప్తంగా 586 పోలీస్‌స్టేషన్లను శత్రుదుర్భేధ్యంగా నిర్మించాం. దేశంలో నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 2014 ఏడాదిలో 126 ఉంటే నేడు ఆ సంఖ్య 11కు దిగివచ్చింది. వచ్చే వార్షిక డీజీపీ/ఐజీపీల సదస్సులోపు దేశంలో నక్సలిజం పూర్తిగా అంతరించిపోతుంది" అని అమిత్‌షా వ్యాఖ్యానించారు.

ఈ నవంబర్ 30న ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగిస్తారు. వికసిత్ భారత్‌లో భాగంగా దేశాన్ని సురక్షితంగా ఉంచే లక్ష్యంతో చేపట్టిన 'సురక్షిత్ భారత్'కు మార్గసూచీని సూచించడంతోపాటు డీజీపీ, ఐజీపీలకు మోదీ ఆరోజు దిశానిర్దేశంచేయనున్నారు. "వికసిత్ భారత్: భద్రతాంశాలు" ఇతివృత్తంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవ్యతిరేక చర్యలు, విపత్తు నిర్వహణ, మహిళా భద్రత, పోలీస్ విధుల్లో ఫోరెన్సిక్ శాస్త్రం, కృత్రిమమేథల విస్తృతస్థాయి వినయోగం అంశాలపై ప్రధానంగా చర్చించనున్నారు.

# కర్ణాటక కాంగ్రెస్ హైకమాండ్ భేటీ: సీఎం మార్పుపై చర్చ

కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అధికార పంచాయితీ ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి మార్పుపై జరుగుతున్న రగడకు తెరదించేందుకు అధిష్ఠానం సిద్ధమైంది. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు అగ్ర నేత సోనియాగాంధీ నేతృత్వంలో హైక మాండ్ భేటీ కానుంది. ఈ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక వ్యవహారాల ఇంచార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలా పాల్గొననున్నారు. సీఎం పదవి నుంచి సిద్ధరామయ్యను తప్పించడం వల్ల జరిగే పరిణామాలు, తలెత్తే ఇబ్బందులు ఎలా ఉంటాయి? ఆయనను కొనసాగిస్తే గనుక ఎదురయ్యే సమస్యలు ఏమిటనేది హైకమాండ్ చర్చించనుంది. ఈ నేపథ్యంలోనే సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లను ఆదివారం ఢిల్లీ రావాలని అధిష్ఠానం కోరింది. దీంతో కర్ణాటకలో నెలకొన్న సందిగ్ధతకు తెరపడే సూచనలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అధిష్ఠానం తీసుకునే నిర్ణయం మేరకు, సిద్ధరామయ్య, శివకుమార్‌లతో మాట్లాడి, ఇద్దరినీ ఒప్పించే ప్రయత్నం చేయనున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

